మాతృమందిరము

అరోవిల్ ఆత్మ




Matrimandir

Soul of Auroville



మాతృమందిరము

అరోవిల్ ఆత్మ



Matrimandir

L'oratoire de la Mère

The Mother's Shrine


శ్రీమాతారవిందపాదారవిందములకు సమర్పితము

తెలుగు సాంస్కృతిక కేంద్రము   అరోవిల్ ఫౌండేషన్   అరోవిల్

విషయసూచిక

ఈ పుస్తకము అరోవిల్ ఆత్మకు అర్పణము.

This book is dedicated to the spirit of Auroville



24 ఏప్రిలు, 1950 సం. శ్రీమాతారవిందుల దర్శన పటము

శ్రీమాతారవిందులు — మాతృమందిరము

అరోవిల్ అను అంతర్జాతీయ నగర నిర్మాణమును సంకల్పించినవారు శ్రీమాత. అది వారి చిననాటి దివ్యస్వప్న రూపకల్పన. ఇక మాతృమందిరము దాని ఆత్మగ నామె చూచిరి. మాతృమందిరగర్భగృహము నామె అంతర్దర్శనమున స్పష్టముగ గాంచిరి. అయితే అరోవిల్ శ్రీఅరవిందుల దివ్యస్వప్నము కూడ. వారి ఐదు స్వప్నములందు సర్వమానవ సమైక్యతా విర్భావమును వారు గాంచిరి. విశ్వజనని దుర్గామందిర నిర్మాణము వారి అలనాటి సంకల్పము.

"నా జీవిత గాథను బాహ్యసంఘటనా వివరములతో నెవ్వరును తెలియజాలరు. ఏలన అది ఆంతరికమైనది" యని శ్రీఅరవిందులు నుడివిరి. "యోగము మరియు ఆధ్యాత్మిక జీవనము నందు ఒక వ్యక్తి యొక్క పుట్టుపూర్వోత్తరాలకు ప్రాముఖ్యత లేదు" అని వారనిరి. శ్రీమాత కూడ అదే విధముగ పలికి యుండిరి.

శ్రీఅరవిందుల నొక శిష్యుడు మీ రచన 'శ్రీమాత' (శ్రీఅరవింద విరచిత మహత్తర చిరుగ్రంథరాజము) లోని మాత ఈ మాతయేనా యని ప్రశ్నింపగా దానికి "ఔను" అని శ్రీఅరవిందులు సూటిగ జవాబు నొసగిరి.

"భూమి ప్రారంభము నుండి ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడు చేతానాభివ్యక్తమునకు అవకాశ ముండెనో అక్కడక్కడ స్వయముగ నేనుంటిని" యని శ్రీమాత చెప్పిరి.

"ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందుల రాక ఒక ప్రబోధమునకో లేక సంస్థాపనమునకో కాదు. అది సాక్షాత్తూ పరమేశ్వరుని నిర్ణీత కార్యావిష్కారము" యని శ్రీమాత పలికిరి.

"రాబోవు మానవ పరిణామము అతిమానసిక చేతనా వైభవమును, సౌందర్యమును గూర్చి లోకమునకు వెల్లడించుటకే శ్రీఅరవిందు లవతరించిరని" శ్రీమాత నుడివిరి.

"శ్రీమాత చేతన, నా చేతన ఒక్కటే" యని శ్రీఅరవిందు లనిరి.

"నేను శ్రీఅరవిందులను కలయుటకు భారతదేశమునకు వచ్చితిని. వారితో కలిసి వసించుట కిచట యుంటిని. వారు దేహము చాలించిన పిదప వారి కార్యమును కొనసాగించుటకు ఉన్నాను" శ్రీమాత శ్రీఅరవిందుల శతజయంతి సందర్భమున ఆకాశవాణి యందు ప్రత్యక్ష ప్రసారమునకై యిచ్చిన సందేశమిది.

అయినను అట్టి శ్రీమాతారవిందుల బాహ్యజీవనములను గూర్చి కొంత తెలిసికొనగోరుట సామాన్య మానవ నైజము.

శ్రీఅరవిందులు భారతదేశ కలకత్తా నగరమున ఆగష్టు 15, 1872 లో జన్మించిరి. తండ్రి అప్పటి ప్రసిద్ధ డాక్టరు కృష్ణధన్ ఘోష్. వారి ఆంగ్లేయ జీవన వ్యామోహమెట్టిదనిన శ్రీఅరవిందులను తన యిరువురి సోదరులతో సహా ఇంగ్లండునకు ఆంగ్ల విద్యాభ్యాసమునకై ఏడు సంవత్సర ప్రాయముననే పంపించిరి. అచట వారికి భారతీయ సంస్కృతి సుంతయైనను అంటరాదనునది ఆ బాలుర నప్పగించిన మాంచెస్టరు ఆంగ్లేయ కుటుంబమున కొసగబడిన తండ్రి కఠిన యాదేశము. కాని పరమేశ్వరుని ఉద్దేశము వేరొకటై శ్రీఅరవిందులను మానవ పరిణామ మార్గదర్శిగ భారతీయ సనాతన సంస్కృతీ పునరుద్ధారకునిగ చేసినది. శ్రీఅరవిందులు అన్న లిరువురితో 14 సంవత్సరముల పాటు ఇంగ్లాండు నందుండి విద్యాభ్యాసము చేసిరి. మొదట లండన్‌లోని సెయింట్ పాల్ పాఠశాల యందు పిదప కేంబ్రిడ్జి కింగ్స్ కళాశాలలోను విద్యాభ్యాసము కొనసాగించిరి. అచట వారు పాశ్చాత్య సంస్కృతీ యవగాహనముతో పాటు గ్రీకు, లాటిను భాషా ప్రావీణ్యతను గ్రహించి, ఆంగ్ల భాషలందు ప్రజ్ఞాపాటవములను గడించిరి. 1890 లో ఐ.సి.యస్ పరీక్ష యందుత్తమ శ్రేణిలో నుత్తీర్ణులైనను పట్టమును పొందుట కీయవలసిన గుర్రపు స్వారీ పరీక్షను స్వేచ్ఛగా తప్పుకుని అనర్హులైరి.

వారు ఇంగ్లాండు నుండి తిరిగివచ్చి 1893 నుండి 1906 వరకు బరోడా మహారాజ సంస్థానము నందు వేర్వేరు బాధ్యతలను నిర్వహించి చివరికి బరోడా కళాశాల వైస్-ప్రిన్స్‌పాల్‌గ నియుక్తులైరి. బరోడాలో నున్నప్పుడే వారు భారతీయ సంస్కృతీ అధ్యయనము, సంస్కృత భాషతో పాటు యితర స్వదేశీ భాషల యందు ప్రావీణ్యత సంపాదించుకొనిరి. అచటి నుండియే వారి రాజకీయ జీవితము ప్రారంభమైనది. పిదప బెంగాలు విభజనాందోళనమును, భారత స్వాతంత్ర్య పోరాటముననను ప్రముఖ పాత్ర వహించిరి. వారి ప్రభావపూరిత రచనా పాటవము సమస్త భారతీయుల యందు మాతృదేశ ప్రేమను, భారతావనిని భారతమాతగా చూచి ఆమె శృంఖలా విముక్తి కర్తవ్య భావమును పూరించి ఉర్రూత లూగించెను. భారత స్వాతంత్ర్య ప్రాప్తి తథ్యమని ఎరిగిన తదుపరి వారి దృష్టి పూర్తిగా యోగము వైపు మరలినది. ఈశ్వరాదేశానుసారము వారు పాండిచ్చేరి యందు స్థిరపడి యోగసాధనను కొనసాగించిరి. 1910 నుండి 1950 వరకు సాగిన వారి యోగసాధనా పర్యవసానమే పూర్ణయోగసిద్ధి. వారి మహిమాన్విత గ్రంథము లందు యోగసమన్వయము, దివ్యజీవనము, సావిత్రి, వేదరహస్యము, ఉపనిషత్తులు, ఈశోపనిషత్తు, గీతా వ్యాసములు, భారత సంస్కృతీ నాగరికత, మానవ ప్రగతి, భావి కావ్యరచన, మానవ ఐక్యతాదర్శము, నాటిక సంకలనము, కావ్యసంకలనము మొదలగునవి గలవు.

శ్రీఅరవిందుల పాండిచ్చేరి జీవనమున కొన్ని ముఖ్య ఘటనలు: శ్రీఅరవిందుల అనుచరులు వారితో వచ్చుటచే నొక ఆశ్రమము నెలకొనుట; 1914 లో శ్రీమాత వచ్చి శ్రీఅరవిందుల సహయోగిని యగుట; 1926 లో శ్రీఅరవిందులు శ్రీకృష్ణచేతన (Overmind) నందుకొనుట; పిదప ఏకాంతవాసియై అతిచేతనావిష్కారముపై ఏకాగ్రత చేయుటకై ఆశ్రమభారమును శ్రీమాత కప్పగించుట; అతిచేతనావిర్భావమును (Supramental manifestation) తన యందు సాధించి, 1950 లో దేహమును చాలించుచు, తన కార్యమును కొనసాగించు (Transformation of the Body) బాధ్యతను శ్రీమాత కొసగుట.

శ్రీఅరవిందుల యోగసిద్ధి ఫలితమగు పూర్ణయోగమును గురించి కొంత వివరించుట యిచట సమంజసము. ముందున్న భారతీయ యోగము లన్నియు జగము మిథ్య యని భావించి దానిని పరిత్యజించుట చేతనే ముక్తి సాధ్యమగుననినవి. ముక్తియే పరమ ధ్యేయముగ నెంచినవి. కాని శ్రీఅరవిందులు జగము మిథ్య కాదనియు వైదిక సంప్రదాయము ప్రకారము జగము కూడ పరమేశ్వరుని వాసస్థానమనియు, దాని యందు ఈశ్వరావిష్కార మొనర్చి భువిని దివి తుల్యమొనర్చుటయే ఈశ్వర సంకల్పమనియు ధృవీకరించిరి. అందులకు ఏకైక మార్గము మానవచేతనా పరిణామము. అందులకై సాధారణ మానవ మానస మజ్ఞాన జనితమగుటచేత దాని నధిగమించి అతిచేతనావిష్కారము చేసికొని మానవ పరిపూర్ణతను సాధించుట యావశ్యకము. దాని ఫలితముగ మానవుడు దివ్యమానవుడై ఆతని జీవనము దివ్యజీవనముగా పరిణతి చెందును.

శ్రీఅరవిందుల యోగమును కొనసాగించిన శ్రీమాత 1956 ఫిబ్రవరి 29 న అతిచేతనావిర్భావమును భువిపై గావించిరి. ఆనాటి నుండి అతిచేతనాజ్యోతి శక్తులు భూమిపై నిరంతరము ప్రసరించుచు మానవ జీవన పరిణామమునకు దోహద మొనర్చుచున్నవి.

శ్రీమాత యోగము నా యోగము మొదటి నుండియు నొకే మార్గము ననుసరించుచున్నవని శ్రీఅరవిందులు చెప్పి యుండిరి.

శ్రీమాత 1878 ఫిబ్రవరి 21 న ప్యారిస్ నగరమున ఫ్రాంసులో జనించిరి. చిన్ననాటి నుండియే వారికి యోగానుభవములు కలిగెను. తర్వాత విద్యాభ్యాసమున వర్ణచిత్ర లేఖనము, సంగీతములందు ప్రావీణ్యత గడించిరి. వారి చిత్రములు ప్రసిద్ధ ప్యారిస్ చిత్రకళా ప్రదర్శనశాల యందు ఆనాటి ప్రసిద్ధ చిత్రకారుల చిత్రములతో పాటు ప్రదర్శింపబడినవి. వారు పియానో


వాయించుట యందు ప్రతిభను సాధించిరి. మంచి రచనా పాటవమును కూడ శ్రీమాత కలిగి యుండిరి. అల్జీరియాలో ప్రసిద్ధ గుప్తవిద్యా గురువైన థియోను వద్ద రెండు సంవత్సరములు (1906-07) అంతేవాసము చేసి గుప్తవిద్యలో ప్రావీణ్యతను గడించిరి. తర్వాత ఆధ్యాత్మికతపై ఆసక్తి గలవారితో నొక బృందము నేర్పరచి 1911-13 లలో అనేక ఆధ్యాత్మిక ప్రసంగముల నిచ్చిరి. అప్పటి వారి రచనలందు 'ప్రార్థనలు — ధ్యానములు' పేర్కొనదగినది. ఆనాటి యోగానుభవము లందొక అశరీర రూపము తన యోగసాధనకు స్వప్నములందు వచ్చి సహకరించుచుండెనని యామె యొకసారి వెల్లడించిరి. 1914 లో వారు భారతదేశమునకు వచ్చి శ్రీఅరవిందులను ప్రథమముగ దర్శించినపుడు వారిని తాను స్వప్నములందు చూచినవారిగ గుర్తించిరి. దాదాపు ఒక సంవత్సరము ఇచట యుండిన తర్వాత ప్రపంచ యుద్ధ కారణముగ వారు భారతదేశము వదలి వెళ్ళవలసి వచ్చినది. తదనంతరము ఒక సంవత్సరము ఫ్రాంసునందు తర్వాత నాలుగేళ్ళు జపానులోను గడిపిన పిదప 1920 ఏప్రిల్ 24 న పాండిచ్చేరికి చివరిసారిగ విచ్చేసిరి. 1926 నుండి ఆశ్రమ నిర్వహణాభారమును, సాధకుల బాగోగుల బాధ్యతలను శ్రీమాత స్వీకరించి 1943 లో ఆశ్రమ పాఠశాలను, 1952 లో శ్రీఅరవిందుల అంతర్జాతీయ విద్యాకేంద్రమును శ్రీఅరవిందుల ఆదేశానుసారము స్థాపించిరి. 1968 లో అరోవిల్ అంతర్జాతీయ నగర స్థాపనము నెలకొల్పి శ్రీఅరవిందుల కార్యసిద్ధికి దోహద మొనర్చిరి. అది ఆధునిక సాంఘిక జీవనపు అత్యున్నతాదర్శములతో కూడిన ఒక ఆధ్యాత్మిక జీవన ప్రయోగము — మానవ ఐక్యతను ధ్యేయముగా గలది.

శ్రీమాత 1962 లో ఏకాంతవాసమును గైకొని ఆశ్రమ నిర్వహణమును తన గది నుండియే ముఖ్య ప్రతినిధులను సంప్రదించుచు నిర్వహించిరి. తన యోగసాధన యందును నిమగ్నులై యుండి శిష్యుడు సత్ప్రేమ్‌కు తన ఆధ్యాత్మికానుభవములను వ్యక్తీకరించుచు వచ్చిరి. దానిని సత్ప్రేమ్ రికార్డు చేసి 'మదర్స్ ఎజెండా' (Mother's Agenda) యను పేరున ప్రచురించిరి. శారీరక పరివర్తనమునకై శ్రీమాత చేసిన ప్రయోగాత్మకానుభవముల దైనందిన చిట్టాయే 'మదర్స్ ఎజెండా'. అది ముందు రానున్న నూతన మానవజాతి సృష్టికి మార్గదర్శి. శ్రీమాత 1973 నవంబరు 17న తమ దేహమును చాలించిరి.

శ్రీఅరవింద మహాయోగి ప్రకారము శరీర పరివర్తనము భౌతిక చేతనా పరివర్తనము చేతనే సాధ్యమగును. అనగా శారీరక కణముల చేతన తుదముట్ట మారవలెను. తత్సాధనా కథనమే మదర్స్ ఎజెండా. భవిష్యత్తునకు దాని ప్రాముఖ్యత చెప్పజాలనిది.



అదితి




అవతారము

శ్రీఅరవిందులు లేకున్న నాకు ఉనికి లేదు, నేను లేకున్నచో శ్రీఅరవిందులకు ఆవిర్భావము లేదు.

— శ్రీమాత

విహంగ వీక్షణము (Aerial View) 2010




మాతృమందిర అండాకార ద్వీపము చుట్టు రానున్న సరస్సు దృశ్యము

ఉత్తరము

సరస్సు

సరస్సు



సరస్సు

సరస్సు

దక్షిణము

దళము లందలి ధ్యాన గదులు

1. నిజాయితీ
2. వినయము
3. కృతజ్ఞత
4. కార్యనిరత
5. ఆకాంక్ష
6. స్వీకృతి
7. ప్రగతి
8. ధైర్యము
9. మంచితనము
10. ఉదారత
11. సమత్వము
12. శాంతి


వనములు

A) అస్తిత్వము
B) చైతన్యము
C) ఆనందము
D) జ్యోతి
E) జీవనము
F) శక్తి
G) సంపద
H) ప్రయోజనము
I) ప్రగతి
J) యువత
K) సామరస్యత
L) పూర్ణత్వము
U) ఐక్యత అను ఉద్యానవనము (Park of Unity)

మాతృమందిరపు లోపలి దృశ్యము — దాని దళముల రెండు వరుసలు

గర్భగృహ వ్యాసము: 24 మీ.
గర్భగృహ మధ్య ఎత్తు: 15. 50 మీ
గర్భగృహ గోడల ఎత్తు: 8.65 మీ
గర్భగృహ స్తంభముల ఎత్తు: 8. 65 మీ
స్ఫటికగోళ వ్యాసము: 0. 70 మీ
మందిర గోళ వ్యాసము: 36 మీ
మందిర గోళ ఎత్తు: 29.00 మీ

దళముల ఎత్తు: 6.50 మీ. (క్రిందికి)
దళముల విస్తరణ: 49 మీ
భూమితలము: స్తంభము మరియు
మొదటి తలము కలియు చోటు 0.0 మీ
క్రిందికొలను: భూతలమునకు క్రిందగా 7. 30 మీ
పునాది: భూమితలమునకు క్రిందగా 9 మీ



1. ధ్యానగదులున్న దళముల వరుస

2. వనములున్న దళముల వరుస

దళమము (పెటల్స్) లందలి ధ్యాన గదులు – వాని రంగులు

ఉత్తరము

పడమర



తూర్పు

ధళముల వివరములు 7 వ పుట

దక్షిణము

ఆశ్రమ, అరోవిల్ వాసులచే మాతృమందిర పునాది తవ్వకపు పని ఆరంభించిన దినము

14.3.71

La fraternité de la collaboration

L'aspiration vers l'Unité dans la joie et la Lumière

bénédictions

14. 3. 71

The fraternity of
collaboration.

The aspiration towards
Unity
in joy and
Light.

Blessings

– The Mother





శ్రీమాత సందేశము

14-3-71


సహకార సౌభ్రాతృత్వము


ఐక్యతకైన ఆకాంక్ష

జ్యోతిరానందములతో

ఆశీస్సులు

శ్రీమాత





Le Matrimandir veut etre le vivant symbole
de l'aspiration d'Auroville au Divin.

Let the Matrimandir be the living symbol
of Auroville's aspiration for the Divine.

దైవము కొరకై అరోవిల్ ఆకాంక్షకు
మాతృమందిరము సజీవ చిహ్నము అగు గాక.

Le Matrimandir veut être
le symbole de la réponse du Divin
à l'aspiration humaine
vers la perfection.

L'Union avec le Divin
se manifestant dans
une unité humaine progressive.



Le Matrimandir veut etre le symbole de la reponse
du Divin a l'aspiration humaine vers la perfection.

The Matrimandir wants to be the symbol of the
Divine's answer to man's aspiration for perfection.

L'union avec le Divin se manifestant
dans une unite humaine progressive

Union with the Divine manifesting
in a progressive human unity.
14-8-1970

పరిపూర్ణత్వము కొరకై మానవుని ఆకాంక్షకు జవాబుగ
దైవము యొక్క ప్రతిస్పందనకు ప్రతీకగ మాతృమందిరము
ఉండగోరుచున్నది

దైవముతో ఐక్యత ప్రగతిశీల మానవ ఐక్యత
యందు అభివ్యక్తమగుట

Le matrimandir veut être le symbole de la Mère Universelle telle que Sri Aurobindo nous l'a enseignée


The Matrimandir wants to be the symbol of the Universal Mother according to Sri Aurobindo's teaching

Le Matrimandir veut etre
le symbole de la Mere Universelle
telle que Sri Aurobindo nous l'a enseignee.

The Matrimandir wants to be
the symbol of the Universal Mother
according to Sri Aurobindo's teaching.

శ్రీఅరవిందుల ప్రబోధానుసారము మాతృమందిరము

విశ్వమాతకు ప్రతీకగ ఉండగోరుచున్నది.


1972

మాతృమందిరము గురించి శ్రీమాత

"అయితే అరోవిల్‌లో వసించుటకు వ్యక్తి దైవచైతన్యముయొక్క స్వచ్ఛంద సేవకుడై యుండవలెను."

అరోవిల్ మధ్యనున్న మాతృమందిరము దైవచేతనకు ప్రతీక యని చెప్పబడకపోయిననూ, యదార్థమునకు అదే అర్థము.

(అరోవిల్ శాసనమును గూర్చి వివరించినపుడు 07-02-68)

*

శక్తి వంటిది ఇది. అరోవిల్‌కు కేంద్రీయశక్తి, అరోవిల్‌యొక్క సమీకృతీకరణశక్తి.

(సంభాషణ 02-07-70)

*

మాతృమందిరము అరోవిల్ యొక్క ఆత్మ. అది ఎంత త్వరగా నెలకొంటే అందరికీ అంత మంచిది, మరీ ముఖ్యముగా అరోవిల్‌వాసులకు.

(వ్రాసిన సందేశము 15-11-70)

*

దయచేసి దానికి మతపు రంగు పులమకండి, మతపు రూపమివ్వకండి. శ్రీమాతారవిందుల దివ్యయోగ ప్రభావిత ప్రకాశితమైన ఈ మాతృమందిరము భారతదేశము నందు రాబోవు కొత్త సృష్టికి అర్థము. మౌలికముగ నది సృష్టికర్త — మాత యొక్క కార్యము. శ్రీఅరవిందులు స్వయముగా దర్శించి, బోధించిన దేమన జడపదార్థమునందు దైవమును ఆవిర్భవింప జేయ విశ్వమాత సృష్టికర్త అయిన సిద్ధాంతమును అర్థము చేసికొనవలెనని.

ప్రశ్న: మనము మాతృమందిరము నెందుకు నిర్మించుచున్నాము?

భారతీయుల యందు బహుసంఖ్యాకులకు వివరణ అనవసరము. వారు తమ వెనుకటి సంప్రదాయము ద్వారా నెరుగుదురు. పాశ్చాత్త్యులకు, అమెరికా వాస్తవ్యులకు వివరణ మవసరము. వారిలో కోటి కొక్కరు మాత్రమే యిది అవసరమని భావింతురు.

ప్రశ్న: మాతృమందిరము నందు ఈ శక్తి ప్రత్యేకముగా కేంద్రీకృతమై యుండునా?

నూతన శక్తి అన్ని చోట్లా పనిచేయును. ప్రత్యేకించి యీ గదియందు నీవు దానిని అనుభూతి చెందుచున్నావు కదూ? ఇచట నది అద్భుతములను చేయగల సామర్థ్యము, సాంద్రత కలిగియున్నది. కాని కొద్దిమంది మాత్రమే దానిని తాకగలరు, చూడగలరు. శ్రీఅరవిందులు, నేను ఆ శక్తిని నగరము మొత్తము మీద కేంద్రీకృతము గావించితిమి. దానిని గంధపరిమళమువలె గుర్తించవచ్చును. దానిని గంధపరిమళము వలె స్పృశించవచ్చును. కాని ప్రజలు ఆశించునట్లుగా అద్భుతములు వుండవు. వారు నమ్మవలెననిన భౌతిక సాక్ష్యములు కావలెను. లేనిచో నమ్మరు. మాతృమందిరమును నిర్మించి, శ్రీఅరవిందుల మరియు నా చిహ్నములను ప్రతిష్ఠించి, వానిపై స్ఫటికగోళమును అమర్చుడు. అపుడు దానిని అత్యంత శక్తివంతమైన కేంద్రముగ నొనర్చుట నా బాధ్యత. అర్హతగలవారు మాత్రమే దానిని చూడగలరు.

(ఒక సంభాషణ తర్వాత వాస్తునిపుణుడు వ్రాసుకున్నది. జూలై, 70)

*

చూడు. ఇదే నేను నేర్చుకొనినది. మతముల వైఫల్యకారణము అవి వేటికవి విడివడడమే. ఇతర మతాలతో నిమిత్తం లేకుండా కేవలము తమ మతమును మాత్రము అనుసరించాలని ప్రతి మతము ప్రజలను కోరడమే. జ్ఞానము యొక్క ప్రతి శాఖ విఫలమైనది ఎందుకంటే అది మిగతావానిని త్రోసిపుచ్చును కనుక. మరి క్రొత్తచేతన కోరునదేమంటే — అది నొక్కి చెప్పేదేమంటే — విభజనము లిక లేవు. పారలౌకిక పరాకాష్ఠను, భౌతిక పదార్థ పరాకాష్ఠను అర్థము జేసికొనుట. అవి కలియుచోటు కనుగొనుట — ఎచ్చటైతేనది వాస్తవిక శక్తి యగునో, ఏ బిందువు వద్ద ఆ రెండు పరాకాష్ఠలు కలిసి నిజమైన శక్తి యగునోనద్దానిని కనుగొనుట.

(వాక్కు 03-01-70)

*

సారతత్త్వమున దివ్యజీవనమును జీవింపగోరువారికి అరోవిల్ స్థానము. కాని వారు మతముల నన్నింటిని పరిత్యజించినవారై యుండవలెను. అవి ప్రాచీనమైనవి, ఆధునికమైనవి, నూతనము లేక భావికి చెందినవైనను సరే.

— శ్రీమాత 1970


Nothing but a radical change of consciousness can save humanity from the terrible plight into which it is plunged. ---- The Mother

చేతన యొక్క సమూల పరివర్తనము తప్ప మరేదియు మానవజాతిని అది మునిగియున్న భయంకర దుస్థితి నుండి కాపాడజాలదు. — శ్రీమాత

మాతృమందిరము — శ్రీమాత ప్రతీక

శ్రీఅరవిందుల ప్రబోధానుసారము మాతృమందిరము విశ్వమాతకు ప్రతీకగ ఉండగోరుచున్నది.

శ్రీమాత



The central circle represents the Divine Consciousness.

The four petals represent the four powers of the Mother.

The twelve petals represent the twelve powers of the Mother manifested for Her work.

మాతృమందిరము మరియు మాతృచిహ్నము. ఇవి రెండును పూర్ణవికసిత పద్మమును వ్యక్తపరచును.

మాతృచిహ్నము యొక్క మధ్యమము మరియు మాతృమందిరము, దైవచేతనను, పరాశక్తిని, మహాశక్తిని వ్యక్తపరచును.

మాతృచిహ్నము యొక్క నాలుగు దళములు మరియు మాతృమందిరమునకు ఆధారభూతమైన నాలుగుజతల స్తంభములు శ్రీమాత నాలుగు స్వరూపములను లేక వ్యక్తిత్వములను తెలియపరచును. అవి మహేశ్వరి (జ్ఞానము), మహాలక్ష్మి (సామరస్యము), మహాకాళి (శక్తి) మరియు మహాసరస్వతి (పరిపూర్ణత).

శ్రీమాత చిహ్నమందలి పంద్రెండు దళములు పంద్రెండు ముత్యములను సూచించును. మేడమ్ థియాను (తల్లిగారి గుప్తవిద్యాగురు పత్ని) మొదటిసారిగా శ్రీమాత తలమీద వానిని చూచి *"నీవు అదియే (దివ్యమాత) ఏలనన దివ్యమాత మాత్రమే వానిని (పంద్రెండు ముత్యములను) కలిగి యుండగలదు"* అని దానిని స్థిరపరచిరి. శ్రీమాత తన తరగతిలో 1954 నందు యింకను యిట్లు వివరించిరి:

> (పంద్రెండు పటలములు/ముత్యములు) ఎవరేమి కావలెననుకున్న వాని నవి సూచించును. చూడుడు. 12 – అదితి మహాశక్తి యొక్క సంఖ్య. అది అన్నింటికీ అన్వయించును. ఆమె తన కార్యములను తన పంద్రెండు స్వరూపముల ద్వారా నిర్వహించును. ఆమె సుగుణములు 12. ఆమె శక్తులు 12, రూపములు 12. మరియు ఆమె అభివ్యక్తమగు స్తరములు12. ఇలా 12 సంఖ్యగలవి చాలా ఉన్నవి. ఇక చిహ్నము సంఖ్య 12 కూడ ఒక చిహ్నమే. అది సృష్టి అభివ్యక్తికి చిహ్నము — ద్విగుణ పూర్ణత మౌలికముగను, అభివ్యక్తి యందును సృష్టి యందును.

ఈ 12 సంఖ్య మాతృమందిరమునందు వివిధ రూపములందు సూచింపబడినది.

మాతృమందిరము — సంఖ్య 12

"పంౖడెండు, అనునది అదితి యొక్క సంఖ్య. మహాశక్తి యొక్క సంఖ్య. ఈ సంఖ్య 12 అన్నదే ఒక చిహ్నము. మరియు ఆవిర్భావపు ౖపతీక. ఇది రెట్టింపు పరిపూర్ణతకు చిహ్నము."

"పంౖడెండు మహాశక్తి యొక్క సంఖ్య. అది మౌలిక సృష్టి, సారాంశరీత్యా సృష్టి — సృజనాత్మక శక్తి మరియు పరిపూర్ణత కూడ. కార్యాచరణము నందలి పరిపూర్ణత. ఈ 12 చాల ముఖ్యమైన సంఖ్య. (24 సంఖ్య 12 కు రెండు రెట్లు, 36 మూడు రెట్లు. 48 నాలుగు రెట్లు. ఇది అతి ౖపాముఖ్యతగల సంఖ్య."

ౖశీమాత

పై వాక్యము మాతృమందిరమునందు 12 సంఖ్య దాని రెట్టింపులు పలుమార్లు వచ్చు కారణము వివరించును. మరియుః

* గర్భగృహ గోడలు పైకప్పు 12 ముఖములు కలిగి ఉన్నవి. 12 ముఖములు 12 నెలలను సూచించును.
* గర్భగృహము నందు 12 స్తంభములు కలవు.
* మాతృమందిరము నుండి అన్ని దిశలకు 12 మార్గములు వెలువడుచున్నవి. అవి బహుశ అతిమానస సూర్యుని 12 కిరణములు కావచ్చును.
* 12 పెద్ద దళములు, 12 చిన్న దళములు ఉన్నవి.
* పెద్ద దళములందు 12 ధ్యానగదులు కలవు. (అవి ౖశీమాత 12 సుగుణములను సూచించును) వివరణ: 37-40 పేజీలలో..
* మాతృమందిరము చుట్టు 12 వనములు గలవు. (ఇవి ౖశీమాత 12 శక్తుల అభివ్యక్తిని సూచించునట్లున్నవి.) — వివరణ: పేజీ 46 నుండి 50 వరకు.
* లోపలి పొర (63×12) = 756 ముక్కోణములు.
* మాతృమందిరమునకు ౖకిందనున్న తామరకొలనులో (12×2×10) = 240) దళములు కలవు.
* గర్భగృహము మరియు దాని 12 గోడలు 12 మీటర్ల వ్యాసార్థముగల స్తూపములో ఉన్నవి.
* మాతృమందిర అడ్డుకోత వ్యాసము 36 (12×3) మీటర్లు
* మాతృమందిరపు అండాకృతిలో నున్న ౖపదేశము యొక్క దీర్ఘవ్యాసము (30 ×12) = 360 మీటర్లు
* 1971 వ సంవత్సరము ఫిౖబవరి 21 వ తేదీ పునాదిరాయి వేయు కార్యౖకమమునందు మానవ ఆకాంక్ష సూచకముగ ఒక పెద్దమంట వెలిగించబడినది. అది పంౖడెండు ఎౖరని సాధారణమైనను అతి సుందరమైన స్తంభములతో చుట్టబడిన వేదిక యందు జరిగినది.
* సరిగ్గా ఏడాది నాటికి 1972 ఫిౖబవరి 21 వ తేదీన మాతృమందిర నిర్మాణ ౖపారంభదినము నాడు పునాదులకై ౖతవ్వి వేసిన మట్టిగుట్ట మీద 12 మంటలు వెలిగింపబడ్డాయి. తర్వాత పునాది ౖపదేశ మధ్యభాగమున నొక పెద్దమంట వెలిగింపబడింది.
* ౖశీమాత తన సన్నిహిత అనుచరుల నుండి 12 మందిని ఎంపిక చేశారు. హాజరయినవారి వరుసౖకమములో ఈ 12 మంది మిక్సర్ మిషనులో తొలిసారిగ రాతిముక్కలను వేయడంతో పని ౖపారంభమయింది.
* మాతృమందిరము మరియు దళముల నిర్మాణ పూర్తికై (3×12) = 36 సంవత్సరములు పట్టినది.
* స్ఫటిక గోళముపై చీకటి సమయములందు 12 డయోడు ల్యాంపులు (Led) ఆటోమేటిక్ గా కిరణపుంజములను ౖపసరింపజేయును.

మాతృమందిర పునాది రాయి (రాళ్ళు)



21-2-1971 న మొదటి పునాదిరాయి వేయు సందర్భమున
మానవాకాంక్షాసూచక పెద్ద మంట — ప్రాతఃకాల ధ్యానము, 12 స్తంభములు



21-2-1972 న రెండవ పునాది రాయి
వేయుటకు శ్రీమాత చేతివ్రాతతో
ఆశీర్వాదముగల ఫలకము



ఫలకముతో రామలింగము, మార్తా



ఆ సందర్భానికై కూర్చబడిన సంగీతం గాలిలో ప్రతిధ్వనిస్తూ ఉండగా శ్రీమాతచే ఒసగబడిన ఈ క్రింది సందేశం చదువబడింది:


"మాతృమందిరం ఆ దైవానికైన అరోవిల్ ఆకాంక్షకి సజీవ చిహ్నం కానివ్వండి."

విశేషమేమంటే 1972 వ సంవత్సరంలో ఫిబ్రవరి 21 వ తేదీ ఉదయం 6.15 నిమిషాలకు ఈ భవన నిర్మాణ ఆరంభానికి, కట్టడానికి సూచనగా ఇంకొక పునాదిరాయి వేయబడినది. ఒక అరోవిల్ బాలిక (శ్రీ పియరో కూమార్తె మార్త), ఒక బాలుడు రామలింగము శ్రీమాత ఒసగిన ఈ ఫలకమును ఒక పునాది రాయిగా నుంచిరి. ఈ రాతిపై* శ్రీమాత - తేదీ, 'ఓమ్' చిహ్నము, ఆశీర్వాదములు అనునవి ఆమె సంతకంతో సహా లిఖించారు. అది తూర్పు స్తంభము — మహాలక్ష్మి అడుగుభాగమున ప్రతిష్ఠించబడినది.


* పేజీ 18

మాతృమందిరం యొక్క పునాదిరాయి 1971 వ సంవత్సరంలో ఫిబ్రవరి 21 వ తేదీన సూర్యోదయ సమయంలో వేయబడింది. ఆ సందర్భంలో శ్రీమాత ఫ్రెంచిలో "21 ఫిబ్రవరి 1971, మాతృమందిరం యొక్క పునాదిరాయి వేయుట, ఆశీర్వాదములు" అని వ్రాశారు. నిజానికి ఈ 'పునాదిరాయి' రాయి కాదు, కాని శ్రీమాత నుండి లభించిన ఒక అమూల్యమైన క్ర్రపెట్టె అది; కాని అప్పటికి వలసిన భూమి కొనుగోలు చెయ్యని కారణంగా అది భవిష్యత్ మాతృమందిర భవనం యొక్క అడుగుభాగాన ఉంచబడలేదు.. అది వటవృక్షానికి, మాతృమందిరానికి మధ్య ఎక్కడో ఒక చోట భూస్థాపితం చేయబడింది. శ్రీఅరవింద విరచితమైన గ్రంథము 'శ్రీమాత' నుండి నళినికాంత గుప్త చదివిన కొన్ని అంశములు:

"ఎట్టి మానవ ప్రయత్నమూ కాక శ్రీమాత శక్తి, తపస్య మాత్రమే మూత పగులగొట్టి, ఆచ్ఛాదనము తెరచి ఆ పాత్రకు రూపు కల్పించి అంధకారము, అసత్యము, మృత్యువు, దుఃఖము నిండిన ఈ ప్రపంచము లోనికి సత్యము, ప్రకాశము, దివ్యజీవనము మరియు అమర్త్యుల ఆనందాన్ని తేగలుగుతుంది."



వాస్తు భావము



మాతృమందిర మౌలిక ప్రతిరూపము మరియు దాని 'పెటల్స్' (దళములు (1971)

శ్రీ రోజె ఆన్‌జే మాతృమందిర రూపకల్పన చేసినపుడు మూడు రూపములను గాంచెను.
మొదటి రూపము: బ్రహ్మము యొక్క ప్రథమ 'అండము'

వాస్తునిపుణుడు ఒక అణచిన గోళాకారముగా (సమతల వ్యాసము 36 మీ, ఎత్తు 29 మీ) యీ అండమునకు రూపము నిచ్చెను. అది యొక సాలగ్రామము. సృష్టి ఐక్యతను సూచించునట్టి ప్రాచీన, తాంత్రిక ప్రతీక. 'నిజమైన మానవ ఐక్యత' ను ఆవిష్కరించుటకు అంకితమైన ఒక నగరము యొక్క ఆత్మకు తగిన ప్రతీక ఇది.


రెండవ రూపము: జడము నుండి పైకి లేచి వచ్చు ప్రకాశమును విరజిమ్ముచున్న సువర్ణ అతిమానస సూర్యుడు.
క్రింది నుండి పైకెగయుచున్న జడపదార్థపు ఆకాంక్ష, మరియు పైనుండి క్రిందికి దిగి వచ్చుచున్న ఈశ్వరానుగ్రహము కలియు స్థానమునకు ప్రతీకగ మాతృమందిరమును గాంచెను. దైవకృపకు ఒక సూర్యకిరణము ప్రతీకయై మాతృమందిరపు పైనుండి క్రింది వరకు ప్రసరించును.

దైవకృప, జడాకాంక్షల కలయిక యొక్క ఉమ్మడి ప్రభావమును మాతృమందిరము సూచించును. జడపదార్థము (భూమి) నుండి వెలివడు నూతన అతిమానస — చేతననది సృజించును. భూమి పై పొరను పెకలించుచున్న (ఒక పెద్దదాని వెనుక నొక చిన్న) లోయ వంటి ఆకృతులను సృజించుచు చుట్టునున్న పరిసరములలో అలలను (వన విభాగముల రూపములు) సృజించుచు, పైకెగయుచున్న అతిమానస సూర్యుడు. ఆ కిరణములు అన్ని వైపులకు ప్రసరించును. (సాంకేతికముగ 12 కిరణములు 12 వెలికిపోవు కాలిబాటలు మొదటి, రెండవ లోయ చరియల ద్వారాను, అలల ప్రదేశముల ద్వారాను వెలువడును). సువర్ణము అతిమానస వర్ణము కనుక ఈ ప్రకాశమాన సూర్యుడు కొత్త చైతన్యమునకు ప్రతీకయై భూమిని క్రొత్త వెలుగుతో ప్రకాశింపజేయును.

మూడవ రూపము: బెంగాలీ భాష యందు 'అరబిందం' అనగా తామర పువ్వు. అరవిందము దైవచేతనకు సంకేతము. 'మాత ఈశ్వరుని చైతన్యము మరియు శక్తి — సర్వమునకు జనని' యని శ్రీఅరవిందులు నుడివినందున దివ్యచైతన్యమునకు ప్రతీక యగు 'పూర్ణవికసిత పద్మ' రూపమున శ్రీమాత చిహ్నము ఉన్నది. వాస్తునిపుణుడు మాతృమందిరమునకు మరియు దాని పరిసరములకు ఈ రూపము నిచ్చెను. మాతృమందిరమును చుట్టి యున్న 12 లోయచరియ భాగములు పద్మపు పెద్ద దళములు. వాని ననుసరించు చిన్న లోయచరియ భాగములు చిన్న దళములు. వాటిని చుట్టి అనుసరించు వనములు మరిన్ని దళములై 'పూర్ణవికసిత పద్మ' రూపమును సూచించును.

(అందుచేతనే కాబోలు శ్రీమాత ఆంఫి థియేటరు నందలి 'అర్న్' (చలువరాతి కలశము) కు తామరమొగ్గ రూపము నివ్వకోరిరి.)

కట్టడము



శ్రీమాత తమ దివ్యదర్శనమున పదే పదే గాంచిన గర్భగృహము మినహా తక్కిన మాతృమందిరమును శ్రీ రోజె ఆన్‌జె అను వాస్తునిపుణుడు రూపొందించెను.

కట్టడపు గణనములను శ్రీ టి. కె. సంతానం, వైజ్ఞానికుడు (స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రిసెర్చ్ సెంటరు, మద్రాసు వారు) చేసిరి.

అరోవిల్ వాస్తునిపుణుడు శ్రీ పియరో సియొనెసి నిర్మాణపు నమూనా పటములు సిద్ధము చేసి నిర్మాణ వ్యవహారమును పర్యవేక్షించెను[1]. అరోవిల్ మరియు స్థానిక పల్లెవాసులు కలసి నిర్మాణ కార్యక్రమమును నిర్వహించిరి.

కొడవలి రూపమున, 38 మీటర్ల ఎత్తు గల్గిన ఉక్కుతో కూడిన నాల్గుజతల కాంక్రీటు స్తంభములు ప్రధాన భాగములై కట్టడపు బరువును మోయుచున్నవి.

ప్రతి జత స్తంభముల మధ్య దూరము — 2.1 మీ.

స్తంభముల ఘనము భూతలము పైన — 40 సెం. మీ.

స్తంభముల ఘనము భూతలము నుండి క్రిందకు 40 — 70 సెం. మీ వరకు.

పునాదుల తర్వాత ఆరంభమైన, కట్టడమునకు ఆధారమైన, నాల్గు జతల స్తంభముల నిర్మాణము శ్రీమాత దేహము విడచు సమయమునకు సరిగ్గా 1973 నవంబరు 17 వ తేదీ సాయంకాలం 7.25 గం.లకు పూర్తైనది. 1976 లో నాల్గుజతల ప్రక్కల [నాలుగు స్తంభములపైని పొడిగింపు భాగముల (ribs)] పని పూర్తయినది. మొదటి అంతస్తు, రెండవ స్తరము, గర్భగృహ స్తరము, శిఖరములు వలయాకారపు సిమెంటు దూలముల చేత కలుపబడెను. 1979 లో గర్భగృహ నేల, గోడలు, కప్పు పనులు పూర్తయినవి. 1980 లో స్పైరల్ ర్యాంపుల (ఎక్కునట్టి వాలు తలముల) ఉక్కు పైపు చట్రములు (మాతృమందిరపు కర్మాగారమున తయారుచేయబడినవి) — ఆ తర్వాత కట్టడమున కుపయోగించిన క్రేను[2] వాని వాని స్థానములందు అమర్చబడినవి.

[1] గర్భగృహ నిర్మాణము మరియు స్పేస్ ఫ్రేము నిర్మాణములతొ శ్రీ పియరోకు అప్పగించిన పని పూర్తయినది.

[2] దూలములు, త్రికోణములు, చక్రము (డిస్కు) లను వాని వాని స్థానములందు పైకెత్తి నిలిపిన పిదప 2000 లో ఈ కట్టడపు క్రేను తొలగింపబడినది



ప్రారంభము 1971
త్రవ్వకము 1971
నాలుగు స్తంభములు 1973
1975
1976
1990
1993

ఒక్కొక్కటి అరటన్ను బరువు కల్గిన (ముందుగ తయారు చేయబడిన) కాంక్రీటు దూలములను ఎత్తి వాని వాని స్థానములందు నిలుపుటకుగాను క్రేను (crane) అవసరమై యుండెను. ఆ దూలముల నన్నింటినీ చేర్చినచో స్పేస్ ఫ్రేమ్ (space frame) ఏర్పడి మాతృమందిరమునకు గోళాకారము వచ్చును. మరియు వెలుపలి గుల్ల మరియు లోపలి పొరలకు ఆధారభూతమగును.

మాతృమందిర కర్మాగారములో తయారుచేయబడిన యీ దూలములను ఎత్తి వాటి స్థానములందు నిలుపబడి నోడ్స్ (nodes) అనబడు ఆరు దూలముల కూడలి యందు కాంక్రీటు చేయబడినది. అందులకు 'లాస్ట్ ఫెర్రో సిమెంటు షట్టరింగు' ఉపయోగింపబడినది. ఈ పని యంతయును 1987 సం. నకు పూర్తయినది.

బయటి గుల్ల (outer shell) ఫెర్రో సిమెంటు ముక్కోణములచే చేయబడినది. వాని మధ్యలోని పెద్ద రంధ్రము 'పోర్ట్ హోల్' (port-hole) అమర్చుటకై చేయబడినది. అవి మరొక కర్మాగారమున తయారుచేయబడి తెచ్చి వాని స్థానమున అమర్చబడినవి.

గుల్ల ఉపరితలము నీరు కారకుండ వుండుటకు ఒక పొర చేత కప్పబడినది. అయితే పొర అతుకు ఊడిపోవుచుండుట వల్ల 10 సం. ల తర్వాత దానిని పూర్తిగా తొలగించి, తిరిగి కొత్త పొరతో కప్పుట మొదలుపెట్టి 2006 సం. నకు ముగించబడినది.



కాంక్రీటు దూలముల సరణి





బాహ్యముఖము

మాతృమందిరము 29 మీ.ఎత్తు, 36 మీ. వ్యాసము కలిగి ఒక గోళాకారమును పోలి నాలుగు జతల స్తంభములపై ఆధారపడి ఉన్నది. దాని నిలువుకోత పటము ఒక అండాకారము[1] (oval), ప్రాచీన తాంత్రిక రూపమగు సాలగ్రామ ఆకృతి.

దాని సంకేతము సృష్టి యొక్క ఏకత్వము. ఈ అణచిన గోళము బంగారు చక్రములతో (discs) కప్పబడినది. అది ప్రకాశమాన అతిమానస సూర్యునికి ప్రతీక.

దాదాపు మూడవవంతు చక్రములు విశాలము మరియు పల్లము (పుటాకారము) గలవి. వీటి వ్యాసము 2.3 లేక 2.4 మీ. మూడింట రెండు వంతులు చక్రములు ఉబ్బినవి (కుంభాకారము) మరియు చిన్నవి. (అనగా 1.3, 1.4, 1.5 లేక 1.6 మీ వ్యాసము) విశాలమైన చక్ర మొక్కటి 210 కిలో. గ్రా బరువు కల్గి వున్నది.

తొలుత చేయబడిన మూడవ వంతు చక్రములు ఫైబర్ గ్లాస్ ప్లాస్టిక్‌తో, (glass reinforcement) చేయబడినవి. తక్కినవి స్టెయిన్ లెస్ స్టీల్ చక్రములు (discs).

ప్రతి చక్రము కట్టడము నుండి దాదాపు 80 సెం.మీ దూరమున స్టెయిన్ లెస్ స్టీలు (10-12 మి.మీ వ్యాసము) కమ్ములతో చేయబడిన కాళ్ళపై అనేక స్టీలు బోల్టులకు (కట్టడపు ఉపరితలమున గలవానికి) బిగించుట జరిగినది.


కట్టడపు దిశల నిర్ణయము:

శ్రీఅరవిందులు 1910 సం., ఏప్రిలు 4 వ తేదీన పుదుచ్చేరికి వచ్చి చేరిరి. ఆ దృష్ట్యా మాతృమందిరపు తూర్పు ద్వారము ఏప్రిలు నాల్గవ తేదీన ఉదయించు సూర్యుని దిశలో నుండునట్లు అమర్చబడినది.




వాస్తు నిపుణుడు శ్రీ రోజె ఆన్‌జె మాతృమందిర ప్రతిరూప చక్రములతో (Discs) పని చేయుచుండుట

[1] మాతృమందిర విభాజ్య పటము చూడుడు. (పుట 8)



బంగారపు పెంకు

ఇంచుమించు రెండు మిలియనుల బంగారు పెంకులు (tiles) (4.5 చ.సెం.మీ) మాతృమందిరపు కర్మాగారము యందు తయారుచేయబడినవి. చాలా పలుచని బంగారు 'ఆకు' ను (24 క్యారట్లు గలది) రెండు గాజుపలకల మధ్య నుంచి ఈ మూడింటిని చేర్చి చాలా అధిక ఉష్ణోగ్రతతో ఒక ఓవెన్‌లో వేడిచేసి కరిగించి ఒకటిగ చేయబడినవి. 8,000 చ.మీ మాతృమందిర ఉపరితల చక్రములకు సరిపడు టైల్సు చేయుటకు దాదాపు 20 కిలోగ్రాముల బంగారము పట్టినది. 1.6 మీ. వ్యాసముగల చక్రములకు (discs) 1,024 టైల్సు, 2.4 మీ. వ్యాసముగల అతివిశాలమయిన చక్రములకు (discs) 2,200 టైల్సు ఉపయోగింపబడినవి.




బంగారుచక్రమున పెంకుల ఆకృతి


నిర్మాణ నగిషీ (స్ట్రక్చరల్ గ్లేజింగ్): రెండు రకముల పదార్థములను చేర్చి చాలా కాలము మనగలుగు మిశ్రమముతో తయారైన 'సిలికోన్', పెంకులు (tiles) అతికించుటకు ఉపయోగించబడినది. తర్వాత ఒక పసుపురంగు 'సిలికోన్' నల్లని అతుకులను మూయుటకు పైన పూయబడినది.

గమనిక: పెంకులు (tiles) వివిధ ఆకృతులలో (పటమునందు వలె) వుండును.


మాతృమందిరము — నాలుగు ముఖద్వారములు




మహేశ్వరి



మహాకాళి



మహాలక్ష్మి



మహాసరస్వతి

1972 వ సం. న శ్రీమాత మాతృమందిరమునకు ఆధారభూతమైన నాలుగు జతల స్తంభములకు తన నాలుగు వ్యక్తిత్వముల పేర్ల నొసగిరి. మందిరము లోనికి వెళ్ళుటకు ఈ నాలుగు జతస్తంభములు ప్రవేశద్వారములుగ నున్నవి. శ్రీఅరవిందుల ప్రకారము ఇవి:

మహేశ్వరి (జ్ఞానము):

విశాల ప్రశాంతత, సర్వజ్ఞత్వ విచక్షణ, ప్రశాంత దయాళుత్వము, అక్షయ కృపాసమృద్ధి, ఆధిపత్యముగల అతిశయ ఘనత మరియు సర్వపరిపాలనా దక్షత్వముతో విరాజిల్లు రూపము.

మహాకాళి (శక్తి):

పటు ప్రతాపము, అప్రతిహత కోపావేశము, వీరభావము, సర్వము నతిక్రమించు ఇచ్ఛ, ఉగ్రవేగము మరియు ప్రపంచము నుగ్రూత లూగించు శక్తితో విరాజిల్లు రూపము.

మహాలక్ష్మి (సామరస్యము):

ప్రస్ఫుట మనోహర, సౌందర్య, సమరస, సూక్ష్మ లయాసమన్వితము మరియు సంశ్లిష్ట లలిత సమృద్ధము అగు మూర్తి.

మహాసరస్వతి (పరిపూర్ణత):

అత్యంత సన్నిహిత విజ్ఞానమూలము, నిర్దోష కర్మకౌశలదక్షత, సర్వత్ర శాంతి మరియు నిశ్చల నిఖిల పరిపూర్ణత్వాది లక్షణములతో విరాజిల్లు మూర్తి.

(మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి శక్తులయొక్క వర్ణన — 'మాతృశ్రీ', శ్రీఅరవిందాశ్రమ ప్రచురణ 1960 సౌజన్యముతో) — డాక్టర్ అనుముల లక్ష్మీనరసయ్యగారి అనువాదం



మహాకాళి ద్వారము

NORD Mahakali

SUD Maheshwari

EST. Mahalakshmi

OUEST Mahasaraswati




మూసిన సువర్ణ కవాటము

ముఖద్వారమునకు పైన, వెనుక, ప్రక్కలందుగల బంగారు ఫలకము మాతృమందిర నాల్గు ముఖద్వారములను సూచించును. ఈ ఫలకముల ముందు నాల్గు దళములుగా ఒక విశాలమైన చక్రము — చక్రమధ్యన ముక్కోణాది ఆకారము కల్గి యుండును. అది మనము ఏ ద్వారము ఎదుట నున్నది తెలియజేయును.

ఉత్తరము	మహాకాళి	శక్తి	ఎర్రని చతురస్రము
దక్షిణము	మహేశ్వరి	జ్ఞానము	నారింజ షడ్భుజము
తూర్పు	మహాలక్ష్మి	సామరస్యము	లేతగులాబీ వృత్తము
పశ్చిమము	మహాసరస్వతి	పరిపూర్ణత	లేతనీలపు ముక్కోణము

మొదటి స్తరము — మధ్య సోపానములు (First level and central stair cases)





మొదటి స్తరము చేరుటకు రెండు పెద్ద దళముల మధ్యనున్న నాలుగు విశాల వాలుతల రహదారులలో నొకదాని ద్వారా క్రిందకు దిగవలెను. పాదరక్షలను వదలి స్తంభముల మధ్యనున్న సోపానము నెక్కవలెను. అచట ఒక సెన్సరు సిగ్నల్ ద్వారా బంగారు ద్వారము తనకు తానుగా తెరచుకొనును. ద్వారము, దానిపై నున్న బంగారు ఫలకమును పోలి యుండును.

ఇపుడు మనము చేరిన మొదటి తలము మధ్యాంతర స్థలము. ఇచ్చటి నేలపై తెల్లని మరియు బూడిదరంగు గల పాలరాయి పరుపబడి యుండును. ఇచట తెల్లని చలువరాయి తిన్నె మీద కూర్చుని తెల్లని మేజోళ్ళు (socks) ధరింపవలెను.


గర్భగృహ ఆరోహణకు గాను మొదట సంకీర్ణ ద్వారము ద్వారా పోవలెను. ఇది పెద్ద చలువరాతి దిమ్మలతో ముందు వెనుకలుగ అమర్చబడి యుండును. వాస్తునిపుణుడు దానిని ఈ యోగమునందు చేయవలసిన ప్రయత్నమునకు ప్రతీక యని భావించెను. మొదటి తలమున నేల నున్న సందు వలన ఈ జత సోపానములు తేలియాడునట్లు కన్పించును. ఈ జత సోపానముల వరుస ఎడా పెడాగా ఉండును.

పూర్తిగ తెల్లనైన చలువరాతి సోపానము ద్వారా ప్రవేశించినవారు, ఈ స్పైరల్ బయటి గోడలు బోర్లించిన శంఖు ఆకృతిని కల్గి యుండుట వలన పైకి పోయినకొలది మెట్లు అంతకంతకు వెడల్పగుట గమనింప వచ్చును. మరియు సువర్ణ మిశ్రిత గులాబిరంగు గల లోపలి ఆచ్ఛాదనమును (inner skin) కనుగొనవచ్చును. దాని రంగు అచటి అన్నింటి యందును ప్రతిఫలించును.

స్పైరల్ సోపానముల ద్వారా రెండవ స్తరమును చేరెదము. అచట అంతయును సువర్ణమిశ్రిత గులాబివర్ణమయమైన వెలుగుతో స్నాతమై యుండుటచేత తెల్లని చలువరాయి, తివాచీ కూడ ఆ రంగులో కన్పించును.

రెండవ స్తరము — స్పైరల్ వాలుతలము (Second Level and Spiral Ramps)





గర్భగృహము నుండి క్రిందికి ప్రసరించు కాంతిపుంజము



ప్యారఫిన్ ద్రవ దీపాలు ఉత్తర దక్షిణ దిశలందు వెలుగుచుండును

రెండవ స్తర నేల, దాని లోపల చుట్టూ పిట్టగోడ తెల్లని చలవరాతితో కప్పబడినది. దాని బయట గాజు పిట్టగోడ మరియు చేతియూత పట్టులు స్పైరల్ వాలుతలమునకు వలెనే అమర్పబడి యున్నవి. స్పైరల్ వాలుతలమునకు ఇరువైపులా ఉన్న గాజు పిట్టగోడల మీద తెల్లని చెక్కతో చేయబడ్డ చేయూత పట్టులు అమర్చబడినవి.

మధ్యభాగమున ఒక వృత్తాకారపు చలువరాతి స్తంభము పైన శ్రీమాత చిహ్నమున్నది. గర్భగృహము యొక్క అడుగు భాగము నుండి ఒక ప్రత్యేక రంధ్రము ద్వారా సూర్యకిరణపుంజము ఈ చిహ్నము కేంద్రముపై ప్రసరించుచు మొదటి తలము ద్వారా మాతృమందిరపు క్రిందిభాగమునకు పోవుచున్నది.

లోపలి నుండి చూచినపుడు మాతృమందిరమొక అర్ధ పారదర్శకమైన గోళముగ కన్పించును. జతస్తంభములున్న చోట్ల లోనివైపు నాలుగు పక్కలు తెల్లని చలవరాతి పరపు చేతను, బంగారు పెంకుల కలయికతోను అమర్చబడినది. వాని మధ్యమున నొక సంకీర్ణ సువర్ణ పలకలు (టైల్సు) తోటి నిర్మించిన కాలువ ద్వారా నీరు ప్రవహించును. ఆ నీరు క్రిందికి ఏటవాలుగా జాలువారుతూ తిరిగి పైకి పంపబడుచుండును. తూర్పు మరియు పడమరల జలధారల వద్ద చలువరాతి ఫలకముపై 'ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే' (శ్రీఅరవిందులు) అను మంత్రము సువర్ణాక్షరములతో అమర్చబడినది.

ఉత్తర, దక్షిణ దిశల యందున్న స్తంభముల ప్రక్క రెండు కూర్చుండు విరామస్థానములు గలవు. అవి కూడ తెల్లని చలువరాతితో కప్పబడి స్పైరల్ వాలుతల ఆరోహణ, అవరోహణ ఆరంభ స్థానములను సూచించును. ఇచ్చటి వాలుతలములు ఒకదాని కొకటి ఎదురెదురుగా నున్నవి. ఆ రెండు ప్రదేశము లందు రెండు ఎత్తైన చలువరాతి శిల్పములు గలవు. అవి ఒక్కొక్కటి నిత్యజ్వాలతో ప్రజ్వలించు ఒక చిన్న దీపమును కల్గి యుండును.

ఉక్కుతో చేయబడిన స్పైరల్ వాలుతల కట్టడపు క్రిందిభాగపు ప్రక్కలు ఫెర్రో సిమెంటుతో కప్పబడినవి. దాని అడుగు భాగము పార్టికల్ బోర్డుతోను, పైభాగము అల్యూమినియము హనీకోంబ్ ఫలకముతోను కప్పబడినది. (ఇటువంటి అల్యూమినియము ఫలకములు విమానపు ఫ్లోర్ కుపయోగింతురు.) దానిపై భాగమున తెల్లని ఉన్ని తివాచీ కప్పబడినది.



క్రిందికి ఏటవాలుగా జాలువారుతూ నీరు ప్రవహించును.



తూర్పు మరియు పడమరల జలధారల వద్ద చలువరాతి ఫలకముపై 'ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే' అను మంత్రము సువర్ణాక్షరములతో అమర్చబడినది.

లోపలి ఆచ్ఛాదనము (Inner Skin)



'లోపలి ఆచ్ఛాదనము'

బయట నుంచి మాతృమందిరము సువర్ణకాంతి పుంజములను వెదజల్లు అతిమానస సూర్యుని వలె నుండును. సువర్ణ గులాబి రంగు వెలుగును లోపలికి పంపించు అర్థ పారదర్శక గోళముగ నుండవలెనని శ్రీమాత కోరిరి. ఆమె వాస్తునిపుణునికి తాను తలచిన వర్ణపు నమూనాగా ఒక చిన్న చీర ముక్కను ఇచ్చిరి. ఆ రంగు ఒక మందారపూవును బోలినది. అది (హైబిస్కస్ రోజా సినెసిస్) శ్రీమాతచే అతిమానసప్రేమయొక్క సౌందర్యము లేదా 'అరోవిల్' అను నామకరణమును పొందినది. ఈ పుష్పము తనంత ఉన్నతస్థాయిలో జీవించమని మనల్ని ఆహ్వానిస్తుంది అని శ్రీమాత నుడివిరి.

'గ్రేస్ లైట్' (కరుణకాంతి) యొక్క వివిధ ఛాయల గురించి శ్రీమాత క్రింది విధంగా తెలిపారు: *'ఆ కొత్త చేతన[1] వచ్చినప్పటి నుంచి నేను పూర్తిగా యేదైనా ఒక భౌతిక కార్యమును తల పెట్టినపుడు అది భౌతికచర్య యందు బాహ్యముగా కాస్త తక్కువ వర్ణముతో ఉండును.'*

[1] (1969 వ సంవత్సరములో శ్రీమాత అనుభవము,)

అది ప్రకాశవంతము. అది సువర్ణము. కొంత గులాబీ రంగుతో మిశ్రమమైనది. కానీ అది ఊదారంగు కాదు. (శ్రీమాత తన చెంతనున్న ఒక మందార పువ్వును చేతిలో తీసుకొందురు.) అది యిట్లుండును.

(శ్రీమాత పూవు యొక్క రంగును చూపెదరు)

ప్రశ్న: అరోవిల్ పుష్పము వలెనా?

అరోవిల్ పుష్పము వలె. కానీ నేను ఉద్దేశ్యపూర్వకముగా దాని నెంపిక చేసితిని. ఇక నా తలంపున అది అతిమానసము యొక్క రంగు. నేను అతిమానస సత్తలను *(beings)* చూచినపుడు. వారు... పూర్తిగ ఆ రంగు కాదు. పుష్పవర్ణము వంటిది కాదు. అది మాంసపు వర్ణము. కాని అది అట్లుండును.

(శ్రీమాత ఆ పుష్పపు రంగును తెలియపరిచిరి.)

లోపలి ఆచ్ఛాదనమున (inner skin) అటువంటి రంగు కల్పించుటకు ఒక ప్రత్యేకమైన తెల్లని వస్త్రము గాజు ఉన్నితో (Fibre glass) నేయబడినది. అది అచ్చట 756 ముక్కోణపు చట్రముల మీద పరుపబడినది. (ఇవి ప్రత్యేకముగా తయారుచేయబడిన అల్యూమినియం చట్రము లగును.) దాని కనుగుణమగు రంగుగల ప్లాస్టిక్ పొరలు బయటి ఆచ్ఛాదనా గుల్ల (outer shell) యందలి 668 పెద్ద రంధ్రముల మీద అమర్చబడినవి. వాని ద్వారా పగటి పూట వెలుగు లోనికి వచ్చును.

రాత్రి సమయమున 1,320 LED ఎలక్ట్రానిక్ మాడ్యూల్స్ ద్వారా ఆ రంగు వెలుగు అమర్చబడును. (ఒక్కొక్కటి మూడు ప్రాథమిక రంగులు గల నాలుగు (తక్కువ విద్యుత్తు నుపయోగించుకొని) వెలుగు నొసగు సదుపాయములను కల్గి యుండును. వాని వెలుగును కంప్యూటరు ద్వారా అవసరమైనంత మార్చి అమర్చవచ్చును.



అరోవిల్ పుష్పము
(అతిమానస ప్రేమ యొక్క సౌందర్యము)


అరోవిల్ పృథ్వికి ఆవశ్యకమైన నగరము.
— శ్రీమాత

గర్భ గృహము (Inner Chamber)

గర్భగృహము శ్రీమాత అంతర్ దృష్టితో చూచినదాని ననుసరించి యథాతథముగా నిర్మింప బడినది.

ఆమె ఆశ్రమ ఇంజనీరు శ్రీ ఉదార్‌కు దానిని వివరించిరి. వారు శ్రీమాత కోరిన కొలతలతో చిత్రపటమును గీసి యిచ్చిరి. ఆమె దానిని వాస్తునిపుణునికి పంపిరి. ఆమె ఏమియు మార్పు లేకుండా దానిని ఒక విశాలమైన కట్టడము నందు అమర్చవలసినదని చెప్పిరి. (కట్టడము తాను చూడలేదని చెప్పిరి.)

* గర్భగృహము (గోడలు చేర్చి) 12 మీ. వ్యాసము కల్గియున్నది. దాని నేల ఒక తెల్లని ఉన్ని తివాచీతో కప్పబడినది. (మధ్య భాగము విడిచి)
* దాని గోడ 8.65 మీ ఎత్తు గలది. దానికి 12 ముఖములు గలవు. అవి సంవత్సరపు 12 నెలలను సూచించును. మరియు నవి ఇటలీలో లాసా అను ప్రదేశము నుండి తెచ్చిన తెల్లని చలవరాతితో కప్పబడినవి.
* దాని కప్పు కూడ 12 ముఖములు కల్గి యున్నది. ఒక్కొక్క ముఖము (ప్రక్క) ఒక ప్రక్క గోడ మీద నుండి 30^0 కోణముతో కేంద్రము పైకి పోవును. ఇలాగు గృహ మధ్యభాగమున దాని యెత్తు 15.2 మీ.
* దానికి జత తలుపులు గల రెండు ద్వారములు గలవు. (అవి ఎదురెదురుగ నున్న ప్రక్కలందు గలవు) అవి మందమయిన చలువరాతి పలకలతో చేయబడినవి. శ్రీమాత ఆశించిన ప్రకారము ఎవరైననూ, తూర్పుదిశ వైపు ప్రవేశించి పడమటి దిశ నుండి వెలికి రావలెను. ఆ ద్వారములు మూసి వున్నప్పుడు అవి దాదాపు కనిపింపవు.
* శ్రీమాత దివ్యదృష్టితో స్పష్టముగా చూచినట్లుగ అందు 12 స్తంభములు గలవు. ఒక్కొక్కదాని వ్యాసము 60 సెం.మీ. అవి కేంద్రమునుండి గోడలకు మధ్యస్థముగ మూలలయందు స్థాపింపబడినవి. వాని ఎత్తు కూడ గోడల ఎత్తుతో సమానమైనందు వలన అవి కప్పును తాకవు. కనుక కప్పునకు అవి ఆధారము నిచ్చుట లేదు.
* గర్భగృహమున కిటికీలు బదులుగా 'ఎయిర్ కండిషన్' చేయబడినది. శ్రీమాత కోరిన ప్రకారము అమర్చిన బంగారు రంగుతో నున్న కనుల కగుపడునట్టి నిటారు జ్యోతిపుంజము చేత మాత్రమే గది లోనికి వెలుగు వచ్చును.



గర్భగృహముయొక్క అనుభాగము (పరిచ్ఛేదము) మరియు ప్రణాళిక



గర్భగృహము


* గదికి మధ్యన ఏకాగ్రతకు ధ్యేయమగు వస్తువు వున్నది. దానిపై సూర్యరశ్మి యొక్క నిటారు జ్యోతి పుంజము పడును. అది 70 సెం.మీ వ్యాసము, 400 కి.గ్రా బరువుగల స్ఫటిక గోళము. ప్రస్ఫుటమైన (optically perfect glass) గాజుతో జర్మనీలో 'స్కాట్' (Scott) కంపెనీవారిచే తయారుచేయబడి, 'జైస్' (Zeiss) కంపెనీవారిచే నునుపు చేయబడినది.

తెల్లటి చలువరాతి బండల యందు మలచిన 3 మీ. వ్యాసముగల శ్రీమాత చిహ్నమొకటి గది మధ్యస్థముగా నుంచబడి దాని కేంద్రస్థానమున శ్రీఅరవిందుల చిహ్నములు 4, వానిపై స్ఫటిక గోళము అమర్చబడినది.

అది ఒక 35 సెం.మీ ప్రక్క (ముఖము) గల ఘనచతురస్ర (cube shed) చట్రము మీద నిలుపబడినది. ఆ చట్రము (stand) బంగారుపూత గల శ్రీఅరవిందుల చిహ్నములు నాలుగు నాలుగువైపులా నుండగా వాటి ముక్కోణములు ఒక దానితో ఒకటి కలుపబడి ఒకదాని కొకటి ఆధారముగా నిలుపబడినట్లు తయారుచేయబడినది.

స్ఫటిక గోళపు ముఖ్యమైన అంశ మేమనిన దానిపై సూర్యకాంతి పుంజపు కేళి. ఆ చిహ్నము భవిష్యదావిష్కారమునకు గుర్తు.


తన చేతనను కనుగొనుటకు 'ఏకాగ్రత ఎలా చేయాల్సిందీ నేర్చుకొనుటకు' ఉద్దేశించబడిన స్థలము గర్భగృహము.



"ఏకాగ్రత అనగా మా యోగము నందు చేతన ఒక స్థితిలో స్థిరీకరింపబడుట. (ఉదా: శాంతి) లేదా ఒక గతి యందు (ఉదా: ఆకాంక్ష, సంకల్పము, శ్రీమాతతో అనుబంధము ఏర్పరచుకొనుట, శ్రీమాత నామస్మరణము గైకొనుట); ధ్యానమనగా ఆంతరిక మనస్సు విషయములపై దృష్టి నిలిపి వాని సరియైన జ్ఞానమును పొందుట".

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందుల మరియు తన ప్రబోధనలు మరియొక క్రొత్తమతమునకో, మతవిశ్వాసమునకో ప్రాతిపదిక కాకూడదని శ్రీమాత స్పష్టముగా తెలియపరచిరి. మాతృమందిరము నందు ఏ విధమైన మతపర ఆచారవ్యవహారాలు జరుపకూడదని ఆమె కోరిరి. వ్యవస్థీకరింబడిన సామూహిక ధ్యానములు సైతము లేవు. ఆచారములు లేవు. ధ్యాన నియమము లేదు. విగ్రహములు లేవు. ఛాయాచిత్రములు లేవు. ధూపము లేదు. పుష్పములు లేవు. సంగీతము లేదు. క్రొత్త మూఢవిశా ్వసమును స్ృజించునట్టి దేదియును లేదు.



మాతృమందిర పైభాగపు అమరిక
(తూర్పు దిక్కు పటము యొక్క పైన నున్నది)

మాతృమందిరపు పైభాగము



హీలియోస్టాటు తెల్లవారు ఝామున పనిచేయుచున్నది

మాతృమందిరపు పై భాగమునకు మరమ్మత్తులు చేయు కర్మచారులు మాత్రమే అనుమతించబడుదురు. 'హీలియోస్టాటు', 'మెయిన్‌టెనెన్స్ క్రేను' 2 ఏ. సి డక్టులు ఒకదాని కొకటి ఎదురెదురుగా నున్నవి.

సూర్యుని యొక్క ఒక కాంతిపుంజమును సదా గర్భగృహములోనికి ప్రతిఫలింప జేయుట హీలియోస్టాటు యొక్క పని . అందు మూడు అద్దములు గలవు. ఒకటి కదలుచుండు అద్దము (ఇది మధ్యాహ్న సూర్యుని ఉచ్ఛస్థానము నుండి రెండు ధృవముల ద్వారా పోవు వృత్తము నందు అమర్చబడి యున్నది. .... మరియు గణిణి — కంప్యూటరు యొక్క (ట్రాకింక్ సిస్టమ్‌తో జోడింపబడినది) మిగతా రెండు కదలనివి. (సూర్యుని మబ్బులు కమ్మినప్పుడు మరియు రాత్రులందు 12 స్పాట్ లైట్ల ద్వారా అదే విధమయిన కాంతిపుంజము ప్రసరింప జేయబడును.




తెరచి ఉంచబడిన క్రొత్త నిర్వహణ క్రేను (2008)

జర్మనీలో డిజైను చేయబడి, తుప్పు పట్టని స్టెయిన్‌లెస్ స్టీలుతో చేయబడిన మెయిన్‌టెనెన్స్ క్రేను పూర్తిగ మడచబడి ఒక భాగములో నొకటిగా అమరి ఉన్నది. ఉపయోగములో లేనపుడు పూర్తిగ కనుపించదు. మాతృమందిరపు గోళము చుట్టు ఎచటి నుండి యైనను 500 కి. గ్రాముల బరువును ఎత్తగలదు. మరియు ఎపుడైన డిస్క్‌లను (బంగారు చక్రాకార పలకలను) తొలగించి మరమ్మత్తు చేయుటకు ఉపయోగపడును.


ఉపయోగించునపుడు నిలబెట్టిన క్రొత్త క్రేను మిగతా సమయములందు మడచబడి యుండి క్రింది నుండి చూచినపుడు కనిపించదు.

మాతృమందిరపు క్రింది భాగము



మాతృమందిర క్రింది భాగమున నున్న తారమ కొలను

మాతృమందిరమునకు క్రింద తామరకొలను నిర్మింప వాస్తునిపుణుడు యోచించెను. కానీ నీడలో కమలములు పూయవు కావున, తామరమొక్కలకు బదులుగ 240 +44 తామరరెక్కల రూపములో మలచబడిన చలువరాతి పలకలతో ఒక కొలను నిర్మించెను. వాని పైకి నీరు బయటి వృత్తము నుండి క్రింద కొలను లోనికి ప్రవహించును. కొలను మధ్యస్థముగ 17 సెం. మీ. వ్యాసముగల ఒక స్ఫటిక గోళము ఉంచబడినది. దీని మీద మాతృమందిరపు పైభాగము నుండి మందిరములోని స్ఫటిక గోళము, రెండు స్తరముల ద్వారా క్రిందికి వచ్చు సూర్యకిరణపుంజము లోతైన స్థలములను ప్రకాశింపచేయు విధముగా ప్రసరించును.




చలువరాతి శ్రీమాత చిహ్నము
(తామరకొలను పైన, మందిరగోళపు అడుగున)

మాతృమందిర గోళపు అడుగుభాగము నందు చలువరాతితో శ్రీమాత చిహ్నము అమర్చబడినది. లోపలి నుండి వచ్చు సూర్యకిరణపుంజము ఈ చిహ్నపు కేంద్రస్థానము గుండా కిందికి ప్రసరించును. మందిరము లోనికి తాజావాయు ప్రసరణ యంత్రాంగము దీనిపై అమర్చబడినది.



జోడిస్తంభముల క్రింద ధ్యానస్థలము



తామరకొలను మధ్యనున్న స్ఫటిక గోళము

దళముల (Petals) యందలి 12 ధ్యాన గదులు

ధ్యానపు గదుల పేర్లు, వర్ణములు, సుగుణములు


జనవరి 1972 సం. నందు శ్రీమాత వాస్తునిపుణునికి ఈ క్రింది దస్తావేజులు అప్పగించిరి.

1. శ్రీమాత చిహ్నము యొక్క రంగులకు సంబంధించి శ్రీఅరవిందులిచ్చిన సూచనలు
2. శ్రీమాత చిహ్నము యొక్క రంగుల జాబితా. 3. శ్రీమాత 12 సుగుణముల పట్టిక.

కేంద్రము మరియు నాలుగు శక్తులు తెలుపు రంగులోను,
వివిధ వర్ణములలో గల పండ్రెండు దళములు మూడు జట్టులుగాను,
పై వైపు నందు వర్ణములు ఎరుపు, కాషాయములతో మొదలై పసుపు వర్ణపు దిశగా ప్రసరించును.
తరువాత జట్టులో పసుపు వర్ణము ఆకుపచ్చ వర్ణము ద్వారా నీలపు దిశగా ప్రసరించును.
మరియు మూడవ జట్టు నీలిరంగు ఊదారంగు ద్వారా ఎడమ వైపుకు ప్రసరించును.
మధ్య భాగము తెలుపురంగు అనువైనది కాని యెడల సువర్ణపొడి రంగును కల్గి యుండవచ్చును.

(ఇవి శ్రీమాత చిహ్నపు వర్ణములు)

శ్రీఅరవిందులు
20 మార్చి 1934



శ్రీమాత చిహ్న పటము

Sincérité, Humilité, Gratitude, Persévérance
Aspiration, Réceptivité, Progrès, Courage,
Bonté, Générosité, Egalité, Paix.

M.

ఇవి శ్రీమాత చిహ్నపు సుగుణముల పేర్లు. ఇవి రెండును ధ్యానపు గదుల పేర్లును, వర్ణములును కూడ

శ్రీమాత క్రింది సుగుణముల జాబితాను ఫ్రెంచిలో ఇలా వివరించిరి. మొదటి ఎనిమిది దైవము వైపు వుండవలసిన వైఖరులను, చివరి నాలుగు మానవత పట్ల వుండవలసిన వైఖరులను సూచించును.

నిజాయితీ, వినయము, కృతజ్ఞత, కార్యనిరత, ఆకాంక్ష, స్వీకృతి, ప్రగతి, ధైర్యము, మంచితనము, ఉదారత, సమత్వము, శాంతి. (7 వ పేజీ చూడుడు)


ఈ సుగుణ ప్రకంపనల నభివ్యక్తము చేయగల 12 పుష్పములు, వాని సంకేతములు (పేజీ 40 లో) సూచింపబడినవి.

1972, జూలైనందు శ్రీమాత వర్ణములను సుగుణములతో ఎలా సరిపోల్చవలసినదీ తెలిపిరి.


దీని ప్రకారము నిజాయితీ అనెడి గది (లేత నీలిరంగు) తో ఆరంభించి వినయము, కృతజ్ఞత (రెండు రకముల ఆకుపచ్చ రంగు), కార్యనిరత (పసుపు రంగు), ఆకాంక్ష (బంగారు పసుపు), స్వీకృతి (కాషాయము), ప్రగతి (బంగారు ఎరుపు), ధైర్యము (ఎరుపు), మంచితనము, ఉదారత (ఊదా), సమత్వము, శాంతి (ముదురు నీలము) అనెడి విధముగా ముగియును. వృత్తాకారపు అమరిక వలన నిజాయితీ, శాంతి అనెడి గదులు పక్క పక్కన ఉండును (1-12). ఈ వర్ణములు గదుల లోపలి భాగములకు వేయబడినవి. ఎవరు ఏ సుగుణము మీద ఏకాగ్రత చేయదలతురో వారు ఆ సుగుణమునకు సంబంధించిన రంగుగల ధ్యానపు గదిలో ఆ రంగు వెలుగుచేత ఆవరింపబడుదురు.

మాతృమందిరపు క్రిందిభాగము (తామర కొలను) వద్ద నాలుగ జతల స్తంభములతో కూడుకుని, ఒక పూర్ణవికసిత పద్మము యొక్క 12 దళములను సూచించు విధముగా పెద్ద దళములు ఏటవాలుగా పైకి పోవుచూ చిన్న దళముల వరకు వృత్తాకారముగా వ్యాపించి యున్నవి. ఈ దళములందు పన్నెండు ధ్యానగదులు అమర్చబడినవి.


బయట వనముల నుండి వచ్చు నాలుగు రహదారులు చిన్న దళముల వద్ద ఒక వృత్తాకారముగా నున్న కాలిబాటను చేరి పిదప క్రిందికి (ఏటవాలుగా) మాతృమందిరపు నాలుగు ముఖద్వారములకు చేరును. ధ్యానగదులు ఈ విధముగా ప్రగతి, ధైర్యము — మహాకాళి; ఆకాంక్ష, కార్యనిరత — మహాలక్ష్మి; నిజాయితీ, వినయము — మహేశ్వరి; మరియు సమత్వము, ఉదారత — మహాసరస్వతి ద్వారములకు పోవు దారులకు ఇరుప్రక్కలా అమర్చబడినవి. మిగిలిన ధ్యానగదుల మధ్య నుండి ఎనిమిది కాలిబాటలు తామరకొలను క్రింది భాగమునకు పోవును. పన్నెండు ధ్యానగదులు మాతృమందిరము యొక్క అణచివేయబడిన గోళాకారమును కల్గియున్నవి. ఆ గోళము నందు తేలియాడునట్లు కన్పించు చలువరాతితో కప్పబడిన కాంక్రీటు బల్ల మీద కూర్చొనవలసి యుండును. గదులకు ఎయిర్ కండిషన్ కలదు. ఒక అర్థ పారదర్శక అండాకారపు ఫైబర్ గ్లాస్ ఫలకము (రియిన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ తో చేయబడినది) కనుచూపు ఎత్తులో (నేలపై కూర్చున్నప్పుడు) ఏకాగ్రత కొరకు అమర్చబడి వుండును. అదొక చిన్న కిటికీ ముందు అమర్చబడెను. పగటి పూట కిటికీ ద్వారా వచ్చు సూర్యకాంతితోను, రాత్రి పూట కిటికీ యందలి విద్యుద్దీప కాంతితోనూ గది నిండి యుండును. ఒక అరోవిల్ కళాకారిణి ప్రతి గదికి ఒక ప్రత్యేక మండలమును డిజైన్ చేసెను. అవి ప్రక్కన:-




1. నిజాయితీ




5. ఆకాంక్ష




9. మంచితనము




2. వినయము




3. కృతజ్ఞత




4. కార్యనిరత




6. స్వీకృతి




7. ప్రగతి




8. ధైర్యము



10 ఉదారత



11. సమత్వము



12. శాంతి

దళములు, వాని సంకేతములు (ఫోటోల వ్యాఖ్యానము)

1. నిజాయితీ:

నిరాడంబర నిజాయితీ ప్రగతి కంతటికిని మూలము. పరిశుద్ధ హృదయము ప్రపంచములోని సమస్త అసాధారణ శక్తులకు సమము.

2. వినయము:

నిజమైన వినయము దైవము ప్రతి వినయము. దైవము లేకున్నచో తానేమియు కాననియు, ఏమియు అర్థము చేసికొనజాలననియు నిష్కపటమైన ఖచ్చితమైన భావన.

3. కృతజ్ఞత:

కృతజ్ఞత మూసిన ద్వారముల నన్నింటినీ తెరచి కాపాడు కృపను ప్రవేశింపజేయును.

4. కార్యనిరత (పట్టుదల):

కార్యనిరత కార్యమునందు సహిష్ణుత. కార్య అంతమువరకు పోవలెనన్న నిర్ణయము.

5. ఆకాంక్ష:

మానవ ప్రకృతికి కృప యొసగిన అద్భుత కానుకలలో ఆకాంక్ష ఒకటి.

6. స్వీకృతి:

దైవకార్యములకు సమ్మతి నొసగి దానిని పదిలముగా నుంచుకొను దక్షతయే స్వీకృతి.

7. ప్రగతి:

పార్థివ జీవన ధ్యేయము పురోగమనము

8. ధైర్యము:

సత్త యందలి ఏ భాగమునను ఏ మాత్రము ఉద్రేకము కలుగకుండ జీవితము నందలి అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొనుట.

9. మంచితనము:

మంచితనపు ప్రేమ కోసమే మంచిగా నుండుట. అప్పుడే మార్గమున ముందంజ వేయుట తథ్యము.

10. ఉదారత (దాతృత్వము):

ఉదారత యిచ్చుట యందలి ఆనందము కొరకే ఇచ్చును. దాతృత్వము బేరసారములు లేకుండ తనను తాను ఇచ్చుకొనుచునే యుండును.

11. సమత్వము:

అన్ని సందర్భములందును సమత్వము కలిగి యుండుట. ఏమి జరిగినను దాని ముందు పరిపూర్ణ స్వాధీనత కలిగి ప్రశాంతత నెలకొని యుండుట.

12. శాంతి:

నీ హృదయము నందు శాంతి నెలకొనిననే తప్ప మరొక చోట ఎక్కడైనను నీవు శాంతిని కనుగొనజాలవు.



ధైర్యము నందలి నడవ

ఒక వృత్తాకారపు (corridor) కాలిబాట ఈ 12 ధ్యాన గదులకు ప్రవేశము కల్పించును. ఈ త్రోవ గోడ యొక్క బయటి పార్శ్వములు ఎర్రని (sand stone) రాతి పలకలతో కప్పబడినవి. వాస్తునిపుణుడు ఈ పలకల కలయికల రేఖల నుపయోగించుకుని ఆయా సుగుణములను వెల్లడించు విధముగ పలువిధ ఆకృతులు (patterns) సృజించెను.

అండాకార ప్రదేశపు అమరిక


1971 వ సంవత్సర ఆరంభమున శ్రీమాత శ్రీ రోజె ఆన్‌జె యొక్క అండాకార ద్వీపపు ప్రణాళికను ఆమోదించినపుడు మాతృమందిర భవిష్య ద్వీపపు అమరిక తీర్మానించిరి. అదే ప్రణాళిక యొక్క నమూనా రెండు విధములుగ తయారు చేయబడినది. మొదటిది 'థర్మోకోల్' నమూనా. అది విడదీసి శ్రీమాత గదికి కొనిపోయి తిరిగి అమర్చి చూపు విధముగ చేయబడినది. రెండవది ఎర్రచందనపు (Rose wood) నమూనా. అది శ్రీమాత గదికి తీసుకొనిపోవుటకు వీలుపడనంత పెద్దదిగ నుండెను. ఇది 1971 ఫిబ్రవరి 21 వ తేదీన మాతృమందిరపు పునాదిరాయి వేసిన సందర్భమున ప్రజల కొరకు ప్రదర్శింపబడినది.

భావి మాతృమందిర ద్వీపపు అండాకారము మాతృమందిర నిలువు విభాజ్యపు ఆకారమును (సాలగ్రామము) పోలి యుండును. మరియు దానికి పది రెట్లు పెద్దదిగా నుండును. (360 మీ. × 290 మీ. అది దాని చుట్టునున్న 3 మీ. వెడల్పుగల బాటతో కలిపి) శ్రీ రోజె ఆన్‌జె దీనిని గూర్చి శ్రీమాతకు తెలిపినపుడు ఆమె 10 సిద్ధి యొక్క సంఖ్య అనిరి.

భావి మాతృమందిర ద్వీపమునకు మూడు ప్రధాన అంశములు గలవు:

1. వటవృక్షము[1]: ఇపుడు అది బహుశ 100 నుండి 130 సం.ల వయస్సుకు పైబడి యుండవచ్చును. శ్రీమాత ఈ చెట్టును అరోవిల్ భూభాగపు కేంద్ర బిందువుగ నెంచిరి. శ్రీమాత వటవృక్షమునకు ప్రక్కన 'ఐక్యత' అను ఉద్యానవనము వుండవలెనని కోరిరి. ఇది ఒక వ్యవస్థ. ఇది మాతృమందిర 12 ఉద్యానవనముల ప్రతీకగ తీర్చబడిన వనము.

2. తామరమొగ్గ ఆకారములో చలువరాతి కలశము ('అర్న్'[2]): ఇది ఒక శంఖురూప గుట్టపై నిలుపబడినది. ఇది 1968 ఫిబ్రవరిలో జరిగిన అరోవిల్ ప్రారంభోత్సవ సమారోహణ కార్యక్రమమున ముఖ్యపాత్ర వహించినది. ఆరు బయటి రంగస్థలము ఈ కలశము ('అర్న్') చుట్టూ ఉన్నది. ఇది వాస్తునిపుణుని అండాకార ప్రదేశ ప్రణాళిక యందొక భాగము. దీని



భావి ద్వీపపు రోజ్‌వుడ్ నమూనా

నిర్మాణము 1972 సంవత్సరాంతమున ఆరంభించబడి ఒక ఏడాదిలో ముగించబడెను. 1990 సం.లో ఎర్ర రాతిపలకలచే పరుపబడినది.

3. మాతృమందిరము: దీని పునాదిరాయి 21 ఫిబ్రవరి, 1971 వ సం.లో వేయబడినది. అది రెండు వరుసల దళములచే (petals) (పెద్ద దళములు, చిన్న దళములు) పరివేష్టింపబడి యున్నది. పెద్ద దళముల యందున్న ధ్యానపు గదుల యందు శ్రీమాత పండ్రెండు సుగుణముల మీద ధ్యానము చేయవచ్చును.

శ్రీమాత శక్తులకు ప్రాతినిధ్యము వహించు పండ్రెండు వనములు మాతృమందిరము మరియు దాని దళముల చుట్టూ కలవు. పండ్రెండు దారులు మాతృమందిరము నుండి అన్ని దిశలకు వ్యాపించును.

[1]42 [2]43 పేజీలు చూడుడు

వటవృక్షము



ప్రారంభోత్సవ సమయమున యీ ఒక్క వటవృక్షము మాత్రము
పూర్తిగ బీడువారిన ప్రదేశమున నిలిచి యుండెను




'సత్యసేవ యందు అరోవిల్ నగరము' అను శ్రీమాత సందేశమును స్టెయిన్‌లెస్ స్టీలు
వలయముపై వ్రాసి బోదె చుట్టు అమర్చిన యిప్పటి వటవృక్షము

1965 వ సంవత్సరాంతమున అరోవిల్ కేంద్రమును స్పష్టీకరించు సమయ మాసన్న మైనది. భావి నగరమును రూపుదిద్ద శ్రీమాత అడుగగా ఫ్రెంచి వాస్తునిపుణుడు పుదుచ్చేరి ఉత్తరదిశ ప్రదేశపు చిత్రపటమును శ్రీమాతకు తెచ్చి యిచ్చెను. ఆమె ఆ సమయమున ఆశ్రమమందలి తన గది యందుండిరి. మరియు ఆ దినములందు ఆ ప్రదేశమునకు కారు పోగల దారి లేనందున ఆమె ఆ ప్రదేశమున కెపుడును పోయి వుండలేదు. ఆమె ఏకాగ్రత చేసి ఆ పటము నందొక స్థలమును సూచించిరి.


వాస్తునిపుణుడు ఒక జీపుపై ఆమె సూచించిన ప్రదేశమునకు వెళ్ళెను. అచట బంగాళాఖాతపు దిశగా దాదాపు బీడువారిన విశాల ప్రదేశము నందొకే ఒక వటవృక్షము నిలిచి యుండుటను కనుగొనెను. భారతదేశము నందు పవిత్రముగా పరిగణింపబడు వటవృక్షము అచట నెలకొని యుండుటను గురించి విని చాలా సంతోషించి దానిని అరోవిల్ భూమి కేంద్రస్థానముగ చేయ శ్రీమాత నిశ్చయించిరి. అరోవిల్ ప్రారంభోత్సవ సమయమున, భావి నగరముపై నొక ప్రదర్శనకు ఆ వటవృక్షము నీడ నొసగెను. మరియు శ్రీమాత సలహా ననుసరించి ఆ చెట్టు బోదె చుట్టూ నొక స్టెయిన్‌లెస్ స్టీలుతో చేయబడిన వలయ ముంచబడెను. దాని మీద (తమిళము నందును, ఫ్రెంచి యందును) 'సత్యసేవ యందు అరోవిల్' అని వ్రాయబడినది.

వటవృక్షము (ఫికస్ బెంగాలెసిస్) ఫికస్ (ఫిగ్) కుటుంబమునకు చెందినది. ఈ వృక్షము దాదాపు 130 సం.ల వయస్సుకు పైబడి యుండవచ్చును. వటవృక్షములకు కొమ్మల నుండి ఊడలను పుట్టించు విశిష్టమైన గుణము గలదు. అవి భూమి లోనికి దిగి కొత్త బోదెలగును. ఈ వటవృక్ష విస్తరణ వ్యాసము దాదాపు 50 మీటర్లకు పరిమితము చేయబడినది. అనగా పరిసరముల ననుసరించి తగిన విస్తరణకు వీలు కల్గి యున్నది.

అరోవిల్ ప్రారంభోత్సవము



1968 ఫిబ్రవరి 28 — అరోవిల్ ప్రారంభోత్సవము



శ్రీ నళినీకాంత గుప్త కలశమునకు మూత వేసిరి




మర్రిచెట్టు క్రింద ప్రదర్శన

1968 ఫిబ్రవరి 28 వ తారీఖున అరోవిల్ ప్రారంభోత్సవమునకు వటవృక్షము దగ్గరగా లోతుగ త్రవ్వబడి చక్కగా తీర్చిదిద్దబడిన ఒక వలయాకారపు ప్రదేశము చుట్టూ దాదాపు 5000 మంది గుమిగూడిరి. ఆ ప్రదేశము మధ్యన నొక గుట్టపై తామరమొగ్గ ఆకారమున 'అర్న్' (urn) తెల్లని చలవరాతితో అమర్చబడి యుండెను. వలయాకారపు ప్రదేశము చుట్టూ అందరికీ నీడ నిచ్చునటుల గుడారములు వేయబడెను. వటవృక్షము చుట్టూ కూడా గుడారములు వేయబడి ఒక ప్రదర్శనము ఏర్పాటు చేయబడినది.

ప్రపంచము నందలి అన్ని దేశములకు మరియు, భారతదేశము నందలి అన్ని రాష్ట్రములకు ప్రాతినిధ్యము వహించు యువతీయువకులు వారి వారి దేశపు లేదా రాష్ట్రపు పేర్లు వ్రాసిన పతాకములను పట్టుకుని జంట జంటలుగ 'అర్న్' కు పోవు ఇరుకైన దారి వెంట పైకి వెళ్ళిరి. అచట తమ తమ దేశ, రాష్ట్రముల నుండి తెచ్చిన పిడికెళ్ల మట్టిని ఆ 'అర్న్' యందు వేసిరి. శ్రీమాత చేతివ్రాతతో ఫ్రెంచిలో వ్రాసిన అరోవిల్ శాసనమును కూడా 'అర్న్' లో వుంచిన తర్వాత దానిని మూసివేసిరి.

అరోవిల్ ప్రారంభోత్సవమునకు ఒక వారము రోజుల ముందు శ్రీమాత తన 90 వ జన్మదినము జరుపుకుని ఆశ్రమము నందలి తన గదిలోనే యుండిరి. ప్రారంభోత్సవ ఆరంభమున ఆమె అరోవిల్ ఆహ్వాన సందేశము మరియు శాసనమును ఫ్రెంచి భాషలో తమ గది నుండియే చదివిరి. దానిని ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారము చేసినది. ఆ రెండు సందేశములు సంస్కృత, ఆంగ్ల, తమిళ భాషలలో కూడా చదువబడినవి.


(అరోవిల్‌లో ఉపయోగించుటకు శ్రీమాత సూచించిన నాలుగు భాషలు తమిళము, ఫ్రెంచి, ఆంగ్లము, సంస్కృతము)



28.2.68.

Greetings from Auroville
to all men of good will.
Are invited to Auroville all
those who thirst for progress
and aspire to a higher
and truer life.

సద్భావన కలవారందరికీ అరోవిల్ అభినందనములు. పురోగమనాన్ని ఆశించేవారికి, అత్యున్నతమైన, అతి వాస్తవమైన జీవితాన్ని కోరుకునేవారికి అరోవిల్ శుభాహ్వానము.



రోజె ఆంజె యొక్క నగర మూల ప్రణళిక నమూనా

అరోవిల్ శాసనము

1. అరోవిల్ ప్రత్యేకించి ఏ ఒక్కరికీ చెందదు. అరోవిల్ సంపూర్ణ మానవజాతికి చెందుతుంది. కానీ, దివ్యచైతన్యానికి అంకితమైన స్వచ్ఛంద సేవకులు మాత్రమే అరోవిల్‌లో జీవించగలుగుతారు.
2. అరోవిల్ అంతులేని విద్యకి, ఎడతెగని పురోగమనానికి, నిత్యయువతకు చోటుగా వుంటుంది.
3. అరోవిల్ గతానికి, భవిష్యత్తుకు వంతెన. బాహ్య, అంతర పురోగమనాలని ఉపయోగించుకుంటూ, భవిష్యత్ సాక్షాత్కారాలకు ధైర్యంతో ముందంజ వేస్తుంది.
4. అరోవిల్ భౌతిక, ఆధ్యాత్మిక జిజ్ఞాసలతో మానవ ఐక్యతను రూపింపచేయు సజీవ ఆలవాలము.



చలువరాతి కలశము (అర్న్)

ఆరుబయటి రంగస్థలము (Amphitheater)



ఆరుబయటి రంగస్థలము, 'అర్న్' (చలువరాతి కలశము)
మాతృమందిరపు పైనుండి చూచు దృశ్యము



సూర్యోదయ సమయాన ధ్యానము, ఆకాంక్ష సూచక అగ్ని ఆవాహన

1972 వ సంవత్సరము (ఆరుబయట రంగస్థల నిర్మాణపని ఆరంభింపక మునుపు), ఆ ప్రదేశ కేంద్రమున వృత్తాకారముగా, మధ్యన ఎత్తైన గుట్టపైన శంఖు ఆకృతిలో 'అర్న్' అనబడు చలువరాతి కలశము మాత్రము ఉండెను. ఆరుబయటి రంగస్థలము పూర్తి చేయుటకు దాదాపు యేడాది కాలము పట్టినది. 1990 లో ఎర్రటి పలకలు (రాజస్థాను నుండి తెప్పించబడి) పరచబడినవి. చలువరాతి కలశము ('అర్న్') లోపల శ్రీమాత చేతివ్రాతతో వ్రాయబడిన అరోవిల్ శాసనముతో పాటు అన్ని దేశముల మరియు భారతదేశపు అన్ని రాష్ట్రముల నుండి తెచ్చిన పిడికెళ్ళ మట్టి ఉంచబడి మూతవేయబడినది.

వెలుపలి ఏటవాలు ప్రదేశముతో కలిపి ఆరుబయటి రంగస్థలపు బాహ్యావ్యాసము 98 మీ., లోపలి వ్యాసము 75 మీటర్లు (ఎగుడు దిగుడు ప్రదేశములతో కలిపి మొత్తము 4400 చ. మీటర్లు మరియు 750 చ. మీటర్లు). దాని లోతు 2.2 మీ. తామరమొగ్గ ఆకృతిగల కలశమును కలుపుకుని ఒక రేఖపై క్రమపద్ధతిలో సమానమైన దూరములో కేంద్రములు కలిగిన వృత్తాకారపు సముదాయముగా మెట్లు ఉన్నవి. (ఆ విధముగా ఈ రేఖ ఆరుబయట రంగస్థలము యొక్క రూపమునకు అక్షరేఖ అవుతుంది). నేల క్రింద ఉన్న నీటిగొట్టముల ద్వారా వాయవ్యదిశగా పారుటచే నీరు బయటకు పంపబడును.

ఫిబ్రవరి 28 అరోవిల్ జన్మదినము మరియు ఆగస్టు 15 శ్రీఅరవిందుల జన్మదినముల యందు ఆరు బయటి రంగస్థలము మధ్యన ఒక పెద్ద భోగిమంట వెలిగించబడును. అచట అరోవిల్‌వాసులు, సహృదయులు సామూహిక ధ్యానమునకు చేరెదరు. ప్రతి గురువారము సాయంకాలము శ్రీమాతచే రికార్డు చేయబడిన సావిత్రి కావ్యపఠనము ధ్యానసంగీత సహితముగ వినిపించబడును. సాంస్కృతిక కార్యక్రమములు అచట అరుదుగ జరుపబడును. ఏలనన అవి అచటి పరిసరములతో సామరస్యత కల్గియుండ వలెను.

ద్వాదశ వనములు — వాని సంకేతములు

మాతృమందిరపు 12 వనములకు శ్రీమాత ఒసగిన నామములు[1]:

అస్తిత్వము, చైతన్యము, ఆనందము, జ్యోతి, జీవనము, శక్తి, సంపద, ప్రయోజనము, ప్రగతి, యువత, సామరస్యత, పూర్ణత్వము.

ఈ నామకరణము యొక్క వరుస క్రమము ముఖ్యమైనది. ఎందుకనగా సంస్కృతమున మొదటి మూడు సత్, చిత్, ఆనందము లగును. అది ఈశ్వరతత్వ సారాంశము. పరిపూర్ణత పరిణామము యొక్క (చరమ) పరమ లక్ష్యము. కావున అది చివరన వచ్చును.[2]

శ్రీమాత, రిచర్డ్ అను శ్రీఅరవిందాశ్రమవాసి సమక్షములో ప్రతి వనము యొక్క కేంద్రపుష్పమును ఎంపిక చేసిరి. అతడు ఈ పూవులను మరియు ఇతర పూవులను కలిపి శ్రీమాతకు తెచ్చి చూపించెను. సంపద, పూర్ణత అను తోటలు తప్ప తక్కినవానికి శ్రీమాత మందారములను ఎంపిక చేసిరి. (శ్రీమాత దాదాపు 900 పూవులకు ఆధ్యాత్మిక నామముల నొసగిరి.) మరియు అనేక మందార పూవులకు 'శక్తి' యను (Power) నామకరణ మొసంగిరి. మిగతా పూలను ఆయా తోటల ప్రకంపనమును బట్టి ఆయా తోటలకు పంచిరి. అన్ని రకముల మందార పూవులు అరోవిల్ శక్తిని అభివ్యక్తీకరింప చేయును అని శ్రీమాత నుడివినట్లు శ్రీ నారద్[3] చెప్పిరి.

'సంపద' నామము నీటి కలువకును (Wealth), 'సమృద్ధి' (Riches) యను పేరు బ్రహ్మజెముడు పువ్వునకు ఇవ్వబడినదని శ్రీ రిచర్డు శ్రీమాతకు జ్ఞాపకము చేసిరి. ఆ పూవులు చాలునని శ్రీమాత తీర్మానించిరి. కనుక 'సంపద' వనము నందు వివిధ రంగుల నీటికలువలతో నిండిన కొలనులు ప్రధానముగ నుండును. సమృద్ధి అనబడు వివిధ రకములైన బ్రహ్మజెముడు మొక్కలతో నిండి రాళ్ళతోటయు (Rockery) యుండును.

---

[1] శ్రీమాత యీ పేర్లను ఫ్రెంచి భాషలో నిచ్చిరి: ఎక్సిస్టన్స్, కాన్షియన్స్, ఫెలిసితె, లుమియేర్, వి, పువ్వార్, రిచెస్, యుటిలితె, ప్రోగ్రె, జనెస్, హార్మొని, పర్ఫెక్షన్,

[2] *శ్రీమాత చిహ్నమును బల్లపరుపుగా నుంచినపుడు వుండవలసిన దిశల గురించి శ్రీమాత సూచనల నీయనందున వాస్తునిపుణుడు 1990 వ సం. లో 'ధైర్య' మనెడి గదిని మహాకాళి స్తంభమునకు ప్రక్కగాను, మరియు 'ప్రగతి' అనెడి ధ్యానపు గదిని, ప్రగతి అనెడి వనములను ఎదురెదురుగా వుండునట్లు అమర్చెను.*

[3] *కొంతకాలము మాతృమందిర తోటల యందు పనిచేసిరి.*

ఈ పంద్రెండు వనములు దేనిని వ్యక్తపరచునో శ్రీమాత వివరించిరి:

* *అది బహుసుందరమై యుండవలెను. ఎంతటి సౌందర్యమనిన జనులు వచ్చి చూచినపుడు "ఆహా! ఇదే కదా అది"* అనవలెను.

* ఒక చైతన్యము నుండి మరో చైతన్యమునకు పోగలిగి నట్లుండవలెను.

* మనము క్రిందికి గొనివచ్చుటకు ప్రయత్నించుచున్న చైతన్యము యొక్క అభివ్యక్తముగ నది యుండవలెను.

దీనిని శ్రీమాత శ్రీ నారద్‌కు తెలిపిరి. అతడు కూడా శక్తియొక్క వనము నిజమైన శక్తిని అభివ్యక్తము చేయవలెనని, సామరస్యత యను వనము సామరస్యతను, అలాగే మిగతా వనములును ఆయా వనముల యొక్క ప్రకంపనము, మరియు సారము అనుభూతికి తేవలెననెను.

ఈ పంద్రెండు వనముల యొక్క ఉమ్మడి సంకేతము:

శ్రీమాత బాహాటముగా చెప్పకపోయినప్పటికీ ఈ తోటలన్నియు శ్రీమాత చెప్పినదానిని అభివ్యక్తపరచును: *"పంద్రెండు శ్రీమాత యొక్క శక్తులు, ఆమె కార్యము కొరకై అభివ్యక్తమైనవి". "పన్నెండు శక్తులు సంపూర్ణాభివ్యక్తికి అవసరమయిన ప్రకంపనలు"* అని శ్రీఅరవిందులు వివరించిరి.

ఆ 'అభివ్యక్తము' ఇంకనూ 'పూర్తి' కానందున మరియు ఆ శక్తులు, ప్రకంపన లన్నియు 'ఆవిష్కరింపబడనందు వలన కాబోలు శ్రీమాత' అవి "ఏ చైతన్యమును మనము క్రిందికి *గొనివచ్చుటకు ప్రయత్నించుచున్నామో దాని అభివ్యక్తమై యుండవలెను"* అని చెప్పిరి. అరోవిల్ వాస్తవ్యుల చైతన్యము పరిణామము చెందుకొలది, ఈ తోటలు కూడా పరిణామము చెందునని వాస్తునిపుణుడు పదే పదే నొక్కి వక్కాణించు చుండుటను ఇది వివరించును.

వనముల కేంద్రీయ పుష్పములు



1. అస్తిత్వ వనము చైత్య శక్తి
అస్తిత్వమునందు చైత్యశక్తి (అస్తిత్వ లక్ష్యము సాక్షాత్కారము)



2. చైతన్యవనము
అతిమానస చైతన్యము ప్రశస్తముగ సచేతనమై శక్తివంతమైనది — ప్రకాశవంతమైనది. స్వతః నిశ్చిత చైతన్యముతో తృటిలేని చలనము గలది



3. ఆనందవనము ఆనందము
ప్రశాంతము, నిశ్చలము, సమము, మందస్మితములై పవిత్రత యందు తన నిజ నిరాడంబర అత్యధిక సౌజన్యము



4. జ్యోతి వనము పరిశుద్ధ శక్తి ప్రకాశము
తన శక్తియందు అనివార్య నిరాడంబరత కలిగి పూర్తిగ దైవదత్తమైనది



5. జీవన వనము
నిశ్చైతన్య ప్రకృతి యొక్క నిమ్నచాలనములను సంయమపరచు మరియు అధిగమించు అన్ని శక్తులు




6. శక్తి వనము సౌందర్యశక్తి
సౌందర్యమున మహాశక్తి



7. సంపద వనము సంపద
దైవార్పితమైనదే సంపద; ఉదార ప్రకృతి వద్దకు
యధేచ్ఛగా ఏతెంచును.



8. ప్రయోజన వనము అరోవిల్ యొక్క ప్రయోజనము
మానవులకు తమను తాము అధిగమింప నేర్పు లక్ష్యం గల ఒక
సృష్టి



9. ప్రగతి వనము ప్రగతికైన శక్తి
అరుదైనది కనుక అమూల్యమైనది,
శ్రద్ధతో అలవరచుకొనవలసినది.



10. యువత వనము
అతిమానస యౌవ్వనము యొక్క సౌందర్యము
ప్రశస్తమైన, తాజాతనము కలిగినది మరియు శక్తివంతమైనది.



11.సామరస్య శక్తి
నిరాడంబరమైనది, ఉదాత్తమైనది,ఘనమైనది,
శక్తివంతమైనది మరియు ఆకర్షణీయమైనది.



12. పూర్ణత్వ వనము
పదార్థములో మానసికతత్వ పరిపూర్ణత
పదార్ధములో మానసిక తత్వ పరిపూర్ణత ఒకటి కాదు. ఈ
పుష్పములోని దళముల వలె అవి సత్యసంధత, విశ్వాసము,
భక్తి, ఆకాంక్ష, సమర్పణ అనెడి ఐదు.

సత్-చిత్-ఆనందముల గూర్చి (మొదటి మూడు వనముల సంస్కృత నామములు)[2];

త్రైకత్వ రూప సచ్చిదానందము తనను తాను బహిర్గత
మొనర్చుకున్నది. అస్తిత్వము గలవన్నియు సత్ చైతన్యము,
ఆనందములుగ పేర్కొనబడుచున్నవి.


శ్రీఅరవిందులు

జ్యోతి, జీవనము, శక్తి (ద్వితీయ త్రివన సముదాయం)[3]

శ్రీఅరవిందుల చిహ్నము విశిష్టత మరియు యీ వనముల తోటి దాని సంబంధము:

అవరోహణ ముక్కోణము సత్-చిత్-ఆనందములను
సూచించును.
ఆరోహణ ముక్కోణము పదార్థము నుండి ప్రాణము,
జ్యోతి, ప్రేమల రూపమున బదులిచ్చు ఆకాంక్షను సూచించును.
అవి రెండు కలిసున్న చోటు మధ్యస్థ చతురస్రము —
తామర — పరాత్పరుని అవతారమును, పరిపూర్ణ ఆవిష్కరణలను
చతురస్రములోని జలము బహుళతను, సృష్టిని సూచించును.

శ్రీమాత



The descending triangle represents Sat-Chit-Ananda.
The ascending triangle represents the aspiring answer from matter under the form of life, light and love.
The junction of both - the central square - is the perfect manifestation having at its centre the Avatar of the Supreme - the lotus.
The water - inside the square - represents the multiplicity, the creation.

---

[2] ఈ మూడు వనములు బ్రహ్మను సూచింప నెంచును. కాలము, ఆకాశముల కతీతమైన సనాతన పరమసత్యము
[3] ఈ మూడు వనములు చిత్ (చేతన) తో సన్నిహిత సంబంధములు గలవి.

సంపద, ప్రయోజనము మరియు ప్రగతి (తృతీయ త్రివన సముదాయం)[4]:

దివ్యజీవన పరిపూర్తికి అవసరమైన శక్తులుగ నివి కనబడుచున్నవి. అది శ్రీఅరవిందుల యోగలక్ష్యము (పెక్కు యితర యోగముల ధ్యేయమైన జీవితము నుండి విముక్తి కాదు). మనము మరిన్ని వివిధ సంపదలను సృజించి వానిని చెప్పుకోతగ్గ ప్రగతికై వినియోగించు మార్గములను కనుగొనవలెను. ఈ మూడు శక్తులను కూలంకషముగ నధ్యయనము చేసి యవగాహన మొనర్చుకొని వానిపై నాధిక్యత కలిగి యుండుట అవసరము.


యువత, సామరస్యత మరియు పరిపూర్ణత (చతుర్ధ త్రివన సముదాయం)[5]:

ఈ మూడు వనములు అటు మార్గములు, ఇటు గమ్యములు. మన మందరము నిత్య యువకులుగ, సామరస్య జీవనముతో, పరిపూర్ణతతో పరివేష్ఠింప గోరుదుము; అది ఆనందదాయకము. కాని అది సాధ్యమగుటకు, ఈ శక్తులు మనలో అభివ్యక్తము గావలెను.

అమరిక

ఈ కేంద్రీయ వనముల కేంద్ర పుష్పములతో పాటు సుమారు అదే ప్రకంపనలు వెలువరించు మరి కొన్ని ఇతర పుష్పములను కూడా ఉంచవచ్చునన్న శ్రీమతి కైలాస్ జవేరీ, శ్రీ రిచర్డుగార్ల ప్రతిపాదనను శ్రీమాత ఆమోదించిరి.

4 ఈ మూడు వనములు సత్ (అస్తిత్వము) తో సంబంధము గలవి.
5 ఈ మూడు వనములు ఆనందమును ప్రకటించుచున్నట్లు తోచును.



మధ్యనున్న బిందువు పరమాత్మ యొక్క ఐక్యతను సూచించును.
లోపలి వలయము సృష్టిని సూచించును. అనగా నగర సృష్టి ప్రతీక.
దళములు ఆవిష్కార శక్తులు, సిద్ధి నిచ్చు శక్తులను సూచించును.
శ్రీమాత

ప్రక్క పేజీలో అస్తిత్వ, చైతన్య, ఆనంద వనములు, పై నుండి క్రింది క్రమములో


సత్


చిత్


ఆనంద



ఐక్యతా వనము, చిన్న రంగస్థలము (mini amphitheatre)

మాతృమందిరము — దాని వన ప్రవేశమును గూర్చి శ్రీమాత సూచనలు

1965 సెప్టెంబరులో ప్రతిపాదిత పట్టణము మీద శ్రీరోజె ఆన్‌జె తన ప్రథమ ప్రతిపాదనను చూపినపుడు శ్రీమాత ఈ క్రింది విధముగా సూచించిరి.

'యూనిటి పార్క్' ఐక్యతా ఉద్యానవనము చుట్టు ఒక విధమైన ఏకాంతము నేర్పరచు ప్రదేశము ఉండవలెను. అపుడు ఏకాంతత, నిశ్శబ్దతకు చోటుండును. ఇది ప్రవేశించుటకు అనుమతి గలవారికి మాత్రమే అందుబాటులో ఉండాలి.

ఐక్యత ఉద్యానవనము 'యూనిటి పార్క్' ఇక ముందు రానున్న అండాకార ద్వీపము, దాని చుట్టు సృజింపబడబోవు సరస్సుచే ఏకాంతతగల ప్రాంతమై యొప్పును.

జనవరి 23, 1970 సం.న ఆమె తన వాస్తునిపుణునికి మాతృమందిరపు డిజైను ఆరంభింపుడని చెప్పిన రెండు రోజులకే శ్రీ సత్ప్రేమ్‌తో ఇట్లనిరి.

"అపుడయితే జనులు క్రమబద్ధమైన ధ్యానముల వంటి వాని కొరకు అచ్చటికి రారు. (అంతరంగిక వ్యవస్థను గురించి తర్వాత చూచెదము). అది ఏకాగ్రతతకై నిర్దేశించబడిన ప్రదేశము. అందరు లోపలికి అనుమతింపబడరు. వారములో ఒక నిర్ణీత సమయము లేదా ఒక దినము (నాకు తెలియదు) పర్యాటకులు లోనికి అనుమతింపబడుదురు. ఎటులైనను మిశ్రమము లేకుండా పర్యాటకులను అనుమతించుటకు ఒక నియమిత దినముగానీ లేదా ఒక నియమిత సమయముగానీ వుండును. మిగతా సమయము ఏకాగ్రత సాధన చేయుట నభ్యసించుటకు మాత్రము వచ్చువారికి, నిష్ఠాపరులకు మాత్రమే కేటాయించబడును. ఇక జనులు ఏకాగ్రత చేయుటకు (శ్రీమాత నవ్వుదురు) లోపలికి అనుమతింపబడుదురు. ఏకాగ్రత నభ్యసించుటకు నియమిత ధ్యానముల వంటివేవీ వుండవు. కాని అచట వారు నిశ్శబ్దముగ నుండవలెను. నిశ్శబ్దత అంటే ఏకాగ్రత. లోపల మాట్లాడకూడదు."

ఒక వారము తరువాత ఆమె అదే విషయముపై మరొకసారి శ్రీ సత్ప్రేమ్‌తో నొక్కి వక్కాణించిరి.

ఇక ఎవరైననూ, భూతలము క్రింది భాగమునకు మొదట చేరుకొని పైకి ఎక్కి గర్భగృహము చేరుటకు కొన్ని షరతులు పూరించవలెను. కొంతవరకు అది ఒక దీక్షా ప్రదానము వంటిది. (సరిగ్గా అట్టిది కాకున్నను) ఎలాగైనా సరే అన్న వైఖరి కాకూడదు.

1972 సం. ఆగస్టు మాసము నందు, మాతృమందిరపు డిజైను అదివరకే నిర్ణయమై యుండగా, మాతృమందిర ప్రవేశమును గురించి, శ్రీమాత అపుడే చెప్పినదానిని శ్రీ రోజె ఆన్‌జె ఇలా వ్రాసిపెట్టిరి.

సిద్ధాంతరీత్యా అరోవిల్ పర్యాటకుల కోసం కాకుండా, అరోవిల్‌వాసుల కోసం ప్రత్యేకింపబడినది. కాని ప్రతి ఒక్కరు అనుమతింపబడరు. అచటికి పోవుటకు మొదటి షరతు ఏమనిన —

నిర్మాణమునకు తోడ్పడినవారు మొదట అనుమతింప బడుదురు.

అనుమానాస్పదమైనవారిని గురించి శ్రీమాతను అడుగవచ్చును. అనుమానాస్పదమైన అస్తిత్వముగలవారు లోపలికి పోకూడదు. ఎంత చిన్న సందేహము గల్గిననూ వారిని గూర్చి శ్రీమాతను అడుగవచ్చును. వ్యక్తులను వారి అర్హతను బట్టి గుర్తింపవలెను.

మాతృమందిరము — నగరమున దాని పాత్ర మరియు ప్రాముఖ్యత

రోజే ఆన్‌జె

ముఖ్య వాస్తు నిపుణుడు (Chief Architect)

మాతృమందిరము అరోవిల్ ఆత్మ, శ్రీమాత కార్యోపకరణము. దాని గర్భగృహము శ్రీమాత శక్తిని స్వీకరించుటకు, ఏకాగ్రత నభ్యసించుటకు ఉద్దేశింపబడినది. ఇది ఒక దేవాలయమో లేక ధార్మికమందిరమో కాదు. మతసంబంధ, ధార్మిక విషయములను మనసులోనికి తెచ్చు ఎట్టి వాస్తుప్రణాళికలకుగాని, అమరికలకుగాని ఈ వాతావరణములో తావు లేదు.

దీక్షాప్రదానకరమైనవిగా కనుగొను ప్రాంగణముల ప్రవేశము:

అడిగినవారు మాత్రమే గర్భగృహము లోనికి అనుమతింపబడుదురని శ్రీమాత విశదముగ వివరించిరి. వనములకు, ధ్యానగదులకు మరియు గర్భగృహముకు ప్రవేశము దీక్షాప్రదానకరమైన సోపానములుగను, దశలుగను గ్రహించవలెను. చూడగోరువారికది వారమునందు ఒక దినమో లేక దినము నందొక గంట కాలమో తెరువబడును. ఇది వారి సంఖ్యను పరిమితమొనర్చు విధములను అనుసరించి ఉండును.

శ్రీమాత ఆమోదించిన నామములను, కొలతలను కలిగిన పండ్రెండు వనములు వానిని రూపొందింప సాధ్యమైనంత మేరకు అత్యంత సౌందర్యవంతమై అంతరిక ఆవిష్కారమునకు దోహదము చేయునట్లు ఉండవలెను.

మొదటి దశ:

గర్భగృహమును కనుగొనుటతో ముగియు దీక్షాప్రదానకరమైన ప్రయాణము కొందరికి అర్ధావృత దళముల మధ్య భూమి నుండి ఉద్భవించునట్లు తోచు సువర్ణచక్ర ఫలకావృత మాతృమందిర బాహ్యరూప దర్శనముతో నారంభమగును. దానిని పరివేష్టించి యున్న పండ్రెండు వనములను కనుగొనుట దీక్షాస్వీకార దశలోనికి ప్రవేశించుట కొక మార్గముగా ఉండవలెను.

రెండవ దశ:

దళముల మధ్యనున్న క్రిందికి దిగిపోవు మార్గమున ప్రయాణము కొనసాగును. ఆ అవరోహణము పండ్రెండు ధ్యానగదులకు మరియు చలువరాతి కొలనుకు గొంపోవును. ఈ గదులలోని ప్రతి అంశము దానికి శ్రీమాత ఒసగిన పేరు మరియు రంగు ననుసరించి తన చేతనావస్థను వ్యక్తపరచవలెను. మాతృమందిరపు దిశగా ఆరోహణము నాలుగు విశాల సోపానముల ద్వారా సాగును. నాలుగు ప్రవేశ ద్వారములు ఆహ్వానము నొసగునట్లు తమంత తాము తెరుచుకొనును.

మూడవ దశ:

వలయాకార ముంగిలి నడవ నుండి మాతృమందిరపు విశాల ఆంతరిక మధ్య ప్రదేశము నొక ఎంచుకొనబడిన సంకీర్ణ ప్రవేశ ద్వారము ద్వారా పోయి చేరుకొనవచ్చును. అది పవిత్ర స్థలముల ద్వారములను బోలి యుండును. దాని రూపవర్ణ విశేషములచే నీ విశాల ప్రదేశము మాతృమందిరపు సజీవ శరీరముగా నొప్పును. దాని గొప్ప విస్తృతి, వర్ణమిళిత కాంతి, ఆరోహణ వాలుబల్లల క్రీడ — యివన్నియు గర్భగృహ ఆరోహణమునకు సన్నద్ధము చేయును. ఆవిష్కార పయనమున యాత్రికు లిచ్చట కొంత ఆగగలరు, లేక ఆగవలె ననవచ్చును.

నాల్గవ దశ:

రెండు వాలుబల్లలను (ramps) చేరుటకు ఈ ఎత్తైన వేదిక వంటి ప్రదేశమును దాటుట ఒక స్తర వ్యత్యాసముచే సూచింపబడినది. గర్భగృహమునకు చేరుటకైన ఆరోహణపు మందగతి ప్రయాణ చివరి భాగమును సంపన్నము గావించుటకై సన్నద్ధమగుటకు ముందు స్వల్ప విరామమును యీ స్తర విభేదము కలుగు జేయును.

ఇది చూడవచ్చువారికి తెరువబడు భవనమే కాని సర్వజనోపయుక్తమైనది కాదు.

రూపకల్పన మొనర్చమని శ్రీమాత నన్నడిగినట్టి ఆమె దివ్యచక్షు (vision) దర్శనము మార్చజాలమని గ్రహించుట చాలా ముఖ్యము. ఆమె కార్యస్థలము నొక జనసామాన్య (public) ప్రదేశముగా మార్చగోరుట లక్ష్యహీనతే అగును. మాతృమందిరము ఆ విధముగా భావింపబడలేదు.

— ఫిబ్రవరి, 2002

భవిష్య కార్యములు (Future Works)

1) మాతృమందిరమును పరివేష్టించియుండు వనములను మరియు ఐక్యతావన పరిసరములను పూర్తి గావించుట.
2) ఆరుబయటి రంగస్థలమునకు తూర్పు పడమరలో నేలమట్టమునకు దిగువనున్న గదులను పూర్తిచేయుట.
3) మాతృమందిర కర్మాగార వసతులను నగర ప్రాంతములో పునఃస్థాపనము గావించుట.
4) దర్శకుల ఆహ్వాన భవనమును మాతృమందిరపు పడమటి మధ్యరేఖపై సరస్సు వెలుపల నిర్మించుట.
5) ఐక్యతా ఉద్యానవనమును పరివేష్టించి యుండు సరస్సును నిర్మించుట.

ఆర్థిక వ్యవస్థ

మాతృమందిరము, దాని పండ్రెండు వనములు, భవిష్య సరస్సు యిది వరకు మరియు యిక ముందు పూర్తిగా ప్రపంచవ్యాప్త సద్భావనాపరుల వ్యక్తిగత విరాళములచేత నిర్మింపబడినవి/ నిర్మింపబడును.

మీ సహకారమును ఆహ్వానించుచున్నాము.

మాతృమందిరము, అరోవిల్ 605101, తమిళనాడు, ఇండియా

(భారతీయ దాతలకు పన్ను మినహాయింపు లుండును)

భవిష్య సరస్సు — నీటి వసతులు


శ్రీమాత మాతృమందిరము మరియు దాని పన్నెండు వనములు ఒక సరస్సుచేత చుట్టబడి యుండుననిరి. వారు యీ ప్రాంతపు నీటిసదుపాయ క్లిష్టపరిస్థితి ఎరిగి యుండినను భావినగరము మరియు సరస్సులకు నీటిని సరఫరా చేయు సమస్యను పరిష్కరించుటకు వివిధ మార్గములను భావించి చూచిరి; సముద్రపు నీటిన ఉప్పు తొలగించి ఉపయోగించు అవకాశమును గురించి, అంతేగాక హిమాలయముల నుండి నీటిని గొనితెచ్చుటను గురించి తరచు వారు ప్రస్తావించిరి.[1] వర్షము లిచట పుష్కలముగ కురియనంతవరకు (సుమారు సం. నకు 1.2 మీ.), నీటి సదుపాయ సక్రమ యాజమాన్యమే ముఖ్య సమస్య యగునుగాని అందుబాటు చాలకపోవుట కాదని ఒక అరోవిల్ హైడ్రో-జియాలజిస్టు శ్రీమాతకు వివరించినపుడామె ఈ సమస్య పరిష్కారమునకు అరోవిల్‌వాసులు తమ సృజనాత్మక తెలివితేటల నుపయోగింపవలెననిరి

వాస్తుశాస్త్రివేత్త, ఈ సరస్సు శ్రీమాత సూచన ప్రకారము అరోవిల్‌వాసులకు మంచినీటి సదుపాయము మరియు అరోవిల్ పొలములకు వ్యవసాయ నీటిపారుదలకు ఆధారభూతమై యుండునని నొక్కి వక్కాణించిరి. 1969 డిసెంబరు మాసమున శ్రీమాత శ్రీ సత్ప్రేమ్‌తో యిట్లు చెప్పియుండుటను గాంతుము: "శ్రీ రోజె కొక ఆలోచన యుండెను. అది కేంద్రమున నొక ద్వీపము, నీటితో చుట్టబడి, నగరమంతటికి నీటి సరఫరా చేయుట కుపయోగపడునట్టి పారుచుండెడి నీరు; ఆ నీరు నగరము ద్వారా పారిన తరువాత, నీటిని శుద్ధిపరచు కేంద్రమునకు పంపబడును. అచటనుండి చుట్టూనున్న వ్యవసాయ భూములకు నీటి సరఫరా చేయబడును."

శ్రీమాతకు సన్నిహితురాలైన ఒక సాధకి ఈ కొలను ఎన్నటికీ సృష్టింపబడదేమోనని విచారము వెలిబుచ్చినప్పుడు శ్రీమాత ఆమెకు మరీ మరీ హామీ యిచ్చిరి. 1970 లో ఆ సాధకి యొక్క మరొక ప్రశ్నకు సమాధానముగా వారు ఈ ప్రత్యుత్తరము నొసగిరి:

"మాతృమందిరము నీటితో చుట్టబడి యుండును. ఆ విషయము యిప్పటికీ, ఎప్పటికీ నిర్ణయింపబడినది. ఐతే నీరు ప్రస్తుతము అందుబాటులో లేకున్నను తర్వాత అందుబాటులో నుండును. కనుక మాతృమందిరము నిపుడు నిర్మించి తర్వాత దాని చుట్టూ నీరు నింపవలెనని నిర్ణయమైనది, బహుశః కొన్ని సంవత్సరాలలో.... మాతృమందిర మిపుడు నిర్మింపబడును. నీరు తర్వాత తేబడును."

ముందుగా రానున్న ద్వీపము యొక్క ఆకృతి మరియు పరిమాణములు 1971 సంవత్సరము చివర నిర్ణయింపబడినవి. (అలాగే సరస్సు యొక్క లోపలి గట్టు స్థానము) మాతృమందిర నిలువుభాగపు పరిమాణమునకు పదిరెట్లు పెద్దది (360 మీ 290 మీ) యైన అండాకార ద్వీపపు నమూనా వాస్తునిపుణుడు శ్రీ రోజె ఆన్‌జెచే శ్రీమాతకు చూపబడి, దానికి సమ్మతి నొసగినపుడు, 'సంఖ్య *10* సిద్ధిని సూచించునని' వారనిరి.



సరస్సునకు రోజె ఆన్‌జె యొక్క చివరి ప్రణాళిక

సరస్సు సుమారు 162,000 చదరపు మీటర్ల వైశాల్యము గలదై 115 మీటర్ల వెడల్పు గలదిగ పై ప్రణాళిక చూపును.

శ్రీమాత అంతర్దృష్టితో గాంచినది రూపుదిద్దుటకు పరిశోధనలు జరుగుచున్నవి.



రానున్న సరస్సును తలపింపజేయు వర్షాకాలపు దృశ్యము

మాతృమందిర నిర్మాతలు

మాతృమందిరంలో జాన్ హార్పర్ పాల్గొనుట 1974 వ సంవత్సరంలో ప్రారంభమయింది. శ్రీఅరవిందాశ్రమ పాఠశాలలో సౌరశక్తికి సంబంధించిన చమన్‌లాల్‌కు శిక్షణలో సహాయం చేస్తూనే వారు మాతృమందిరం గర్భగృహంలోనికి సూర్యకిరణాన్ని తీసుకురావడానికై కటక వ్యవస్థ (Optical systems) కొరకు పరిశోధనలు కొనసాగించారు. 1978 వ సంవత్సరం నుండి వారు మాతృమందిరం వద్దే పూర్తి సమయం ఉంటున్నారు. మాతృమందిర నిర్మాణాన్ని గత 37 సంవత్సరాలుగా పూర్తిచేయడానికై జరిగిన పనిని గురించి వారు వ్రాసినది ఇది — (ఫిబ్రవరి, 2008)

మనము మాతృమందిరమును గురించి మాట్లాడినపుడు సాధారణముగ నచట జరుగు పనిని గురించి మాటలాడుదుము కాని అచట పనిచేయుచున్నవారిని గూర్చి ఎపుడు చెప్పము, ఐనను యీ వందలాది జనులు నిర్మాణ కార్యక్రమములో దశాబ్దముల తరబడి పాల్గొనుచు మాతృమందిరమును నేడున్న రీతిని నిర్మించిరి.

నిర్మాతయగు దైవము మాతృమందిరమును ఆవిష్కరించుటకు ఉపయోగించుకొనిన పనిముట్లుగ యీ జనులను చెప్పవచ్చును.

పనియొక్క ప్రతి అంశము అంకితమైన సమూహములచే వాస్తునిపుణుడు (architect) మరియు నిర్మాణ నిపుణుల (engineer) పర్యవేక్షణ క్రింద పరిపూర్ణ సంపూర్ణతలను సంతరించుకొనినది.

దశాబ్దముల పైబడి అనేక విశిష్ట బృందము లుండెను. వారిలో కొందరి కార్యదక్షత చెప్పుకోదగ్గది. ఉదాహరణకు 1971 లో పునాదికై బిలము త్రవ్విన 400 మంది పనివారి బృందము; లేక చాలా ఎత్తైన సారువ కట్టువారి బృందము — వారు వ్యాయామ క్రీడాకారుల వలె 36 మీటర్ల ఎత్తు వరకు చాలాసార్లు రక్షణ నిచ్చు పాదుకాపు బెల్టు లేకుండగనే ఉక్కు గొట్టముల సారువ నిర్మించుచుండిరి. యంత్రముల అనుభవమున్న పనివారి బృందము స్పైరల్ ర్యాంపుల స్టీలు గొట్టముల ఫ్రేములు, మరియు 20 సంవత్సరములుగ ఉపయోగించిన మాతృమందిరముపై యున్న మొదటి క్రేనును తయారుచేసిరి. కొన్ని సమూహములు నిశ్శబ్దముగ క్రమబద్ధత పాటించి సంవత్సరముల తరబడి (RCC) సిమ్మెంటు కాంక్రీటు కట్టడమున కవసరమగు స్టీలు కమ్ములను వంచుచుండిరి. అదే కోవకు చెందిన మరికొన్ని సమూహములు 1100 ప్రీ కాస్ట్ కాంక్రీటు దూలముల (precast concrete beams) కవసరమగు స్టీలు కమ్ములను 9 సంవత్సరముల పాటు తయారుచేసిరి. ఆ దూలములు మాతృమందిరపు బయటి గోళాకార రూపము నిచ్చు స్పేస్ ఫ్రేము (space frame) నకు ఉపయోగింపబడినవి.

దూలముల కొరకు కాంక్రీటు పోయువారు, యువకులు మరియు పెద్దలు, యింకను దూలముల నెత్తి వాని స్థానమున అమర్చు సమూహము లుండెను. ఆ సమయమున పెద్ద కాంక్రీటింగు పనులు జరుగునపుడు అరోవిల్ నలుమూలల నుండి మరియు ఆశ్రమము నుండి కూడా వచ్చు స్వచ్ఛంద సేవకుల సంఖ్య అవసరానుసారము పెంచబడుచుండెను. వారు మొదట నాలుగు బృహత్ స్తంభాల ప్రక్కలు (four giant ribs) తరువాత ప్రక్కన నుండి పొడిగింపబడిన క్యాంటి లివర్ లు (canti levers) గర్భగృహ నేల, కప్పు మరియు గోడలు చివరగా వానిని చుట్టియున్న దూలములను (pre-cast beams) వాని స్థానమున నిలిపి కాంక్రీటు చేయుటకు సహాయపడిరి. కట్టడము పైన ముఖ్యమైన కాంక్రీటింగు పనులు 1988 లో ముగిసినంతనే, త్వరలోనే పాలరాతి పనిలో నైపుణ్యము సంపాదించిన తమంత తాముగా జట్లుగా ఏర్పడిన స్త్రీపురుషులు ఇటలీ నుంచి తెచ్చిన పాలరాతిని గర్భగృహ గోడలకు, రాజస్థాన్ నుండి తెచ్చిన చలువరాతిని నేల యందమర్చుటను చేసిరి. ఈ సమూహములో ఏకాగ్రతగల కొందరు గది మధ్యమున గాజుగోళము (crystal globe) ను ఎత్తుకొని నిలిచియున్న శ్రీఅరవిందుల చిహ్నములను కేంద్రముగాగల 3 మీటర్ల వ్యాసపు పాలరాతి యందు శ్రీమాత చిహ్నమును (నాలుగు భాగములుగా) మలిచిరి.

నాణ్యమైన గాజుగోళము (crystal) ఇచట పనివారిచే తయారుచేయ బడలేదు. ఆ అద్భుతకృతి మన కొరకు జర్మనీలోని జేయిస్ ఫ్యాక్టరీకి (Zeiss Factory) చెందిన వేరొక జట్టు పనివారిచే 1980 వ సంవత్సరపు చివరలో మూసపోసి తయారుచేయబడి పాలిషింగ్ చేయబడినది.

ఎల్లప్పుడూ ప్రశాంతముగా, అంకితమై పనిచేయు స్వచ్ఛంద సేవకుల (volunteers) సమూహము లుండెను. వారు షట్టరింగులు శుభ్రపరచుట, కాంక్రీటు చిప్పింగు చేయుట (concrete chipping) సారువ పైపులకు రంగువేయుట మరియు కట్టడపు పని ముందుకు సాగుటకు అవసరమగు చిన్న చిన్న పనులు చేయుచుండిరి. కర్మయోగ మార్గమున ఒసగబడిన ఏ పనియైనను చివరగా వినయవిధేయతలతో కూడినదే అనుటకు మాతృమందిరము సర్వోన్నత కర్మ క్షేత్రము నొసగినది.


MATRIMANDIR 2006

కొన్ని సమూహములు మాతృమందిర కట్టడపు అనేక విశిష్ట భాగములను రూపొందించుటకు పరిశోధనలో నిమగ్నులైరి. బయటి చక్రఫలకముల బంగారం పొదిగిన గాజుపెంకులు, లోపలి ఆచ్ఛాదనపు అర్ధ పారదర్శక ముక్కోణములు, సూర్యకిరణములు గర్భగృహము లోనికి పంపు హీలియో స్టాట్ (helio stat) దళముల యందలి ధ్యానమందిరముల వివిధ రంగుల గోళాకార కప్పులు (domes) ఇవన్నీ కాక ఇంకెన్నో మాతృమందిరపు విభిన్న ఆవశ్యకతలపై ధ్యానముంచి అనేక వ్యక్తులు చేసిన తీవ్ర కృషి, పరిశోధనల పరిణామము.

కట్టడపు వెలుపల సైతము మాతృమందిర ఉద్యాన వనములందు మొక్కలను ప్రేమించువారు, ఉద్యానపాలకులు (Horticulturists) మరియు స్వచ్ఛంద సేవకులు చాలా కాలము అత్యంత ఆసక్తితో ఉత్సాహముగా పనిచేసిరి.

నేడు పూర్తిగా తోటల అమరిక, వాని హద్దులు, కాలిబాటలు, వాని పక్కల నున్న గడ్డిబయళ్ల చేత వేరుగా గుర్తింబబడినవి. ఈ ఎకరము లన్నిటి బాగోగులు చూచుటకు దినదినము అధికసంఖ్యలో చేరుచున్న స్వచ్ఛంద సేవకులతో కూడిన అనేక జట్లు కలవు. రానున్న తోటల అభివృద్ధి కొరకు ఎదురుచూచు, వానికై పనిచేయకోరువారు అనేకులు కలరు.

ఇక మాతృమందిర నిర్మాణము దశలవారిగా పూర్తగుచుండగా, దానిని జాగ్రత్తగా చూచుటకు, దానిని ఉపయోగించు రీతిని వ్యవస్థీకరించుటకు సహజముగనే కొత్త జట్లు ఏర్పడినవి. స్వచ్ఛంద సేవకులు ప్రతి దినము వచ్చి చలువరాతి నేలలు, తివాచీలు శుభ్రపరచి అనేక వందల మేజోళ్లు, దిండువరలు, దుప్పట్లు ప్రతి దినము చలువ చేయవలసిన లాండ్రీ పని చేసి మాతృమందిరము లోపలి భాగము చక్కని స్థితిలో ఉండునట్లు చూచెదరు. ఈనాడు మాతృమందిర ప్రవేశమును కల్పించు జట్టు ఒకటి తయారైనది. అరోవిల్‌వాసులతో కూడిన ఒక ప్రముఖ జట్టు ప్రతిదినము అరోవిల్ చూడగోరువారి బుకింగ్ లను క్రమబద్ధీకరించి, ప్రప్రథమముగా మాతృమందిరమును చూడవచ్చువారికి దాని పరిచయము గావించి, చిరకాల మిత్రులకు కూడా గర్భగృహ ప్రవేశాది సేవలందు తోడ్పడును. వారితో పాటు నిశ్శబ్దముగా పనిచేయు స్వచ్ఛంద సహాయక బృందమొకటి మాతృమందిరమును దర్శించు సమయములో దర్శకులకు, అతిథులకు, గర్భగృహమును దర్శింపగోరి వచ్చు అరోవిల్‌వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండడమొక పనికాగా, దాని ఇంకొక పని కట్టడమునందు, గర్భగృహమునందు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూచుట.

ప్రస్తుతము (ఫిబ్రవరి 2008) దాదాపు 300 మంది మాతృమందిరము వద్ద పని చేయుచున్నారు. వారిలో కొందరు అరోవిల్‌వాసులగు స్వచ్ఛందసేవకులు, మరికొందరు వేతనమునకు పనిచేయువారు. వీరందరూ పూర్తిగాని కట్టడపు పనిని ముగించుటకు, లోపల పనిని పూర్తిచేయుటకు, పూర్తియైనవానిని సరిచూచు పనిలో నిమగ్నమై యున్నారు. మాతృమందిర కార్యాలయములో పనిచేయుచు ప్రపంచ నలుమూలల నున్న సహాయకులతో సంబంధమును పెంపొందించుకొనినవారితో మొదలుకొని మాతృమందిరపు ఉపరిభాగము కొత్త క్రేను అమర్చి తుది ఏర్పాట్లు గావించువారి వరకు అందరినీ అనుసంధానపరచు సూత్రమొకటున్నది — తమిళము, రష్యను, ఆంగ్లము లేక ఫ్రెంచి, ఏ భాష మాట్లాడిన వారయినా సరే అందరినీ మౌనముగా కలుపు విశ్వజనీన భాష ఒకటున్నది — అది పనియందు పంచుకున్న ఆకాంక్ష యొక్క ఆనందము, శ్రీమాతచే ఒసగబడిన పనికి అధికాధిక పరిపూర్ణతను కొనివచ్చుటకైన ఆకాంక్షను పాలుపంచుకున్న ఆనందము. ప్రతి ఒక్కరు తమదైన రీతిలో దానిని అనుభూతి చెందెదరు. తామిక్కడ చేయు పనిని గురించి, మాతృమందిర మననేమో — దానిని గురించి ప్రతి ఒక్కరికి వేరు వేరు అవగాహనము లుండవచ్చు. కాని అందరి ఆకాంక్ష మాత్రమొక్కటే — ఎవరికీ కనబడకనే అది అన్ని అవరోధములను దాటి అందరితోను పాలుపంచుకొను ఒక అనిర్వచనీయ బంధాన్ని నెలకొల్పుతుంది.

మాతృమందిర నిర్మాణ కాలానుక్రమణిక


ఫిబ్రవరి 21, 1971	మాతృమందిర పునాదిరాయి వేయుట
ఫిబ్రవరి 21, 1972	పునాదికి ప్రథమముగ కాంక్రీటు పోయుట
నవంబరు 17, 1973	మాతృమందిరమున నిపుడు ఆధారమైన నాలుగు స్తంభముల పరిపూర్తి
1973-1976	స్తంభములను పైన కలుపు వలయము వరకు కాంక్రీటు కట్టడపు పని ముగింపు
1976-1978	గర్భగృహ కట్టడము

1978-1988	ఎక్కు వాలుతలములు (ramps) మరియు గోళాకార రూపము నిచ్చు దూలముల సరణి నిర్మాణము (space frame)
1988-1994	గర్భగృహ పరిపూర్తి
1991-2000	అడుగున నున్న జలాశయ నిర్మాణము, స్తంభముల పొడిగింపులు, మధ్యనున్న సోపానములు, బయటి గుల్ల, దళములు, మూడవ వంతు బంగారు పెంకుల తయారీ మరియు వానిని చక్రఫలకములపై నమర్చుట, ఆరుబయటి రంగస్థలము (Amphi-Theatre) నందు ఆగ్రారాతి ఫలకలను పరచుట ముగింపబడినవి. తోటల మరియు వికేంద్రీయ దారుల యొక్క మరియు అండాకార రహదారి యొక్క అమరిక ప్రారంభమైనది.
2000-2008	స్వర్ణ చక్రఫలకముల తయారీ మరియు వాటిని తమ స్థానములందు అమర్చుట పూర్తియైనది. దళములపై ఆగ్రారాతి పరుపు, కట్టడములోని పాలరాతి పరపు, లోపలి ఆచ్ఛాదనము, నీరుకారుట నాపు బాహ్య ఆచ్ఛాదనము, మాతృమందిరపు క్రిందనున్న చలువరాతి తామర కొలను, దళముల అంతర భాగములు, ప్రవేశ ద్వారముపైనున్న బంగారు ఫలకములు, క్రొత్త స్టెయిన్లెస్ స్టీలు క్రేను, యివన్నియు కూడ ముగింపబడినవి. మరియు తోటల ఎత్తుపల్లముల నిర్ణాయక అమరిక, తోటల యందలి వికేంద్రీయ దారుల యందు రాతిపరపు యింకను వనముల మొత్తము 20 ఎకరములకు నీటి స్వయంచాలక పారుదల విధానము (automated irrigation system) యొక్క ప్రతిష్ఠాపనములు కూడ ముగిసినవి.

"మాతృమందిరమును నిర్మించినపుడు నా ప్రతీకను, శ్రీఅరవిందుల ప్రతీకలను, వానిపై స్ఫటిక గోళమును ప్రతిష్ఠింపుడు. దానిని పటిష్టమైన శక్తికేంద్రముగా నొనర్చుట నా బాధ్యతగా గైకొందును."

— శ్రీమాత






This world was not built with random bricks of Chance,
A blind god is not destiny's architect;
A conscious power has drawn the plan of life,
There is a meaning in each curve and line.
It is an architecture high and grand.
By many named and nameless masons built
In which unseeing hands obey the Unseen,
And of its master builders she is one.

Savitri p. 460

ఈ జగతి అనిశ్చిత సంభవముల అస్థిర పునాదులతో నిర్మితమైనది కాజాలదు.
అంతిమ గమ్యమును నిర్ధారించిన దైవము అంధుడు కానేరడు.
జీవన ప్రణాళికను రచించినది ఒకానొక చైతన్యశక్తి యగును.
ప్రతి అర్ధ ఆవృత్తమందును ప్రతి రేఖ యందును అంతరార్థము ఇమిడి యున్నది.
అద్భుతావహమగు ఒక నిర్మాణ కౌశల మందు కనిపించును.
అసంఖ్యాకులగు తాపీ పనివారిచే అది నిర్మితమైనది, కొందరు ప్రసిద్ధులు, కొందరనామకులు.
అదృశ్య హస్తములు అదృశ్య యజమాని ఉత్తరువుల ననుసరించినవి.
కుశలురగు దాని నిర్మాతలలో ఆమెయు నొకతె.

అనువాదము: ఆచార్య తంబిశెట్టి రామకృష్ణ

1972 ప్రథమ కాంక్రీటు పోయు సందర్భము





View Point దర్శన స్థానము

మాతృమందిరము, వనములు, రానున్న సరస్సుల నిర్మాణము పూర్తిగా ప్రపంచవ్యాప్త సద్భావనాపరుల వ్యక్తిగత విరాళముల చేత చేయబడుచున్నది. మీ సహకారమును ఆహ్వానించుచున్నాము.

వివరములకు:

MATRIMANDIR

P.O Auroville - 605101, Tamilnadu, INDIA

భారతీయ దాతలకు ట్యాక్స్ తగ్గింపు ఉండును.

దర్శన స్థానము — ప్రవేశ అనుమతి



దర్శకులు

మాతృమందిర ప్రవేశ విధానము శ్రీమాత ఉద్దేశించిన ప్రకారము అనుసరించబడుచున్నది.

మాతృమందిరము పర్యాటకుల గమ్యము కాదు.

అరోవిల్ విజిటర్స్ సెంటర్ నందు పరిచయాత్మక వీడియో చూచిన తర్వాత యిష్టపడినచో ఐక్యతా ఉద్యానవనమును, మాతృమందిరమును బయట నుండి చూచు స్థానమునకు (View point) అనుమతి పత్రముతో పోగలరు. అది మాతృమందిరమునకు దక్షిణ దిశ నున్న ఎత్తైన సుందర వనప్రదేశము. అనుమతి పత్రములకై రుసుము లేదు. దాదాపు ఒక కిలోమీటరు నీడగల కాలినడకను వెళ్ళవలెను. నడవలేని వారికి ఎలెక్ట్రిక్ బండి సదుపాయము గలదు. స్వంత వాహనములను విజిటర్స్ సెంటర్ పార్కింగులోనే వదలవలెను.

బయటి దర్శనము తర్వాత మాతృమందిరములో ఏకాగ్రత/ధ్యానము చేయదలచినచో విజిటర్స్ సెంటర్ ఇన్‌ఫర్ మేషన్ వ్యక్తిని సంప్రదింపుడు. బుకింగులు వ్యక్తిగతముగా మాత్రమే చేయబడును.

వివరలములకు అరోవిల్ వెబ్ సైట్ చూడుడు.

http:/www.auroville.org/the city/matrimandir/mmmain.htm

GRATITUDE: Sri Aurobindo Ashram, Sri Aurobindo Society, Memorial Fund, Auroville Foundation and all builders of Matrimandir

Acknowledgements:

English source: Articles from Gilles Guigan, John Harper, Roger Anger

Telugu translation: Pala Lakshminarayana, Smt. Prasunamba, Smt. Dr. V. Vizialakshmi

Photos courtesy: Matrimandir Office, Dominique Darr, Paris (on pages 19, 20, 22, 24, 25, 41, 42), Giorgio, Jothi Prasad, Krishna Tiwari & Gilles Guigan (Auroville Archives), Lakshminarayana & Surya (Matrimandir Archives) and some unknown photographers


Drone shots: Ashwin Elumalai, Ashwin Chandrasekar

Graphics: Aravinda & Jasmin, K. Kameswara Raju, Murali (AVdzines)

Assistance: Matrimandir staff, Chitra Srinivasamurthy, John Harper, Jv, T. Madhava Rao, A. Mallayya, Rajkumar & Aparna, Shiva Vangara, K. K. Syamala, S. Triveni, C. Umasundari, G.Varadharajan, Varalakshmi, Vinod, Members of Telugu Samskritika Kendramu

With appreciation and thankful regards to Sri Aurobindo Ashram Press

A publication of Auroville Foundation, Auroville.
Printed at Sri Aurobindo Ashram Press, Puducherry, India
Year: 2016



డ్రోన్ చిత్రం



